# తెలంగాణ కిరణం

సోమవారం, ఆగష్టు 12, 2024 | ప్రజల కోసం - మా అక్షరం | సంపుటి : 14 సంచిక : 87 పేజీలు : 8

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, rangareddy, nizamabad, nalgonda


## కొట్టుకుపోయిన తుంగభద్ర డ్యామ్ గేటు

### - లక్ష క్యూసెక్కుల నీరు వృధా



**అమరావతి :** కర్ణాటకలో కురుస్తున్న వర్షాలకు తుంగభద్ర డ్యామ్ గేటు విరిగి కొట్టుకుపోయింది. శనివారం రాత్రి 11 గంటలకు హొస్పేట వద్ద తుంగభద్ర డ్యామ్‌లో వరద తగ్గడంతో గేట్లను మూసివేస్తున్న క్రమంలో 19వ గేటు చైన్ లింక్ తెగి కొట్టుకుపోయింది. దీంతో డ్యామ్ నుంచి నీరు ఏకధాటిగా దిగువకు ప్రవహిస్తూనే ఉంది. ఇప్పటివరకు లక్ష క్యూసెక్కులకుపైగా నీరు వృథాగా కిందికి పోయిందని అధికారులు పేర్కొన్నారు. ఈ ఒక్క గేటు విరిగి కొట్టుకుపోవడంతో తుంగభద్ర డ్యామ్ నుంచి 60 టీఎంసీల నీరు వృథాగా పోనుందని తెలిపారు. మరోవైపు షిమోగలో కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాలకు తుంగభద్ర డ్యామ్‌లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఇక తుంగభద్ర డ్యామ్ గేటు కొట్టుకుపోవడంతో నీరు దిగువకు వరదలాగా ప్రవహిస్తుండటంతో అధికారులు అలర్ట్ అయ్యారు. నదీపరివాహక ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలను అప్రమత్తం చేశారు. వరద నేపథ్యంలో సురక్షితంగా ఉండాలని సూచించారు. ఈ క్రమంలోనే తుంగభద్ర నుంచి సుంకేసుల ప్రాజెక్టుకు ఏకంగా లక్ష క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండటంతో ఇక్కడ కూడా అధికారులు అలర్ట్ అయ్యారు. తుంగభద్ర గేటు మరమ్మతులు పూర్తి చేసే వరకు సుంకేసుల ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగనుందని అధికారులు వెల్లడించారు. వరద ఎక్కువగా ఉండటంతో సహాయక చర్యలకు అడ్డంకిగా మారిందని చెప్పారు. తుంగభద్రలో వరద తగ్గాక అధికారులు మరమ్మతులు చేపట్టి విరిగిపోయిన గేటు స్థానంలో కొత్తది ఏర్పాటు చేయనున్నారు.అయితే ఎగువ నుంచి వరద తగ్గడంతో డ్యాం గేట్లను మూసివేసే సమయంలో ఈ సంఘటన చోటు చేసుకుందని అధికారులు వెల్లడించారు.

ప్రాజెక్టు నుంచి 60 టీఎంసీల నీళ్లు బయటికి వదిలిన తర్వాతే గేటు పునరుద్ధరణ పనులు చేపడతామని తెలిపారు. ఇందులో భాగంగా ప్రస్తుతం 33 గేట్లు తెరిచి నీటిని కిందికి వదులుతున్నట్లు వివరించారు. డ్యామ్ భద్రతకు సంబంధించి ఇంత పెద్ద ఘటన జరగడం గత 70 ఏళ్లలో ఇదే మొదటిసారి అని అధికారులు పేర్కొన్నారు. ఇక ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా కౌతాలం, కోసిగి, మంత్రాలయం, నందవరం మండాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు.

మరోవైపు కర్ణాటకలో తుంగభద్ర డ్యామ్ గేటు విరిగిన ఘటనపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆరా తీశారు. ఘటనకు సంబంధించిన వివరాలను జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో లోతట్టు ప్రాంతాల ప్రజలను అలర్ట్ చేయాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. డ్యామ్‌లో 6 మీటర్ల ఎత్తు వరకు నీరు ఉందని అధికారులు సీఎం చంద్రబాబుకు వివరించారు. స్టాప్‌లాక్ అరేంజ్‌మెంట్ ద్వారా నీరు వృథా కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మరోవైపు తుంగభద్ర డ్యామ్ అధికారులతో మాట్లాడి తాత్కాలిక గేటు ఏర్పాటు చేసేలా చూడాలని మంత్రి పయ్యావుల కేశవ్‌కు సీఎం చంద్రబాబు సూచించారు. అయితే డ్యామ్ పాత డిజైన్ కావడం వల్ల స్టాప్‌లాక్ గేట్ ఏర్పాటు చేయలేని పరిస్థితి ఉందని మంత్రి పయ్యావుల సీఎంకు వివరించారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో ఘటనాస్థలికి ఇంజినీర్ల బృందం, సెంట్రల్ డిజైన్ కమిషనర్ వెళ్లినట్లు మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని కలెక్టర్లను ఆదేశించినట్లు పేర్కొన్నారు.
కౌతాలం, కోస్గి, మంత్రాలయం, నందవరం ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. శ్రీశైలం, సాగర్, పులిచింతల ప్రాజెక్టుల అధికారులకు కూడా ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు.

## హైదరాబాద్‌లో మోనార్క్ ట్రాక్టర్స్ విస్తరణ



**కాలిఫోర్నియా:** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి బృందం అమెరికాలో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. పలు ప్రముఖ సంస్థలు, కంపెనీల ప్రతినిధులతో భేటీ అవుతున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానిస్తున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో తమ సంస్థ విస్తరణకు మోనార్క్ ట్రాక్టర్ సంస్థ ముందుకు వచ్చింది. దీంతో మరిన్ని ఉద్యోగాలు లభించే అవకాశం ఉంది. హైదరాబాద్‌లోని తమ పరిశోధన-అభివృద్ధి సంస్థను విస్తరించే అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఉన్నతాధికారులతో కూడిన తెలంగాణ ప్రతినిధి బృందంతో మోనార్క్ సంస్థ ప్రతినిధులు చర్చించారు. తెలంగాణకు పెట్టుబడుల సాధనే లక్ష్యంగా అమెరికాలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందాన్ని మోనార్క్ ట్రాక్టర్ సంస్థ ప్రతినిధులు కలిశారు. అనంతరం సంస్థ ప్రతినిధులు హైదరాబాద్‌లో తమ ఆర్ అండ్ డీ సంస్థకు అనుబంధంగా స్వయంప్రతిపత్తి ట్రాక్టర్ టెస్టింగ్ సదుపాయాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. హైటెక్, పర్యావరణ అనుకూల కంపెనీలను ఆకర్షించడంపై తాము దృష్టిసారించామని, మోనార్క్ ట్రాక్టర్స్‌ను తెలంగాణకు ఆహ్వానిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. స్వయంప్రతిపత్తి ,ఎలక్ట్రిక్ వాహనాల సాంకేతికతలో తెలంగాణను అగ్రగామిగా నిలిచేలా, ఆ విజన్‌లో మోనార్క్ ట్రాక్టర్స్ బాగమై రాష్ట్రంలో తమ ఉనికిని విస్తరించుకోవాలని తాము ఆశిస్తున్నట్లు ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణలో తమ కార్యకలాపాలపై చర్చించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, ఇతర అధికారులను కలవడం ఎంతో సంతోషం కలిగించిదని మోనార్క్ ట్రాక్టర్ సీఈవో ప్రవీణ్ పెన్మెత్స వెల్లడించారు. హైదరాబాద్‌లోని తమ కేంద్రం అధునాతన డ్రైవర్-ఆప్షన్ స్మార్ట్ ఎలక్ట్రిక్ ట్రాక్టర్‌లను రూపొందించడంలో కీలకపాత్ర పోషించిందని ప్రవీణ్ పెన్మెత్స తెలిపారు.

## అమరరాజా ఇక్కడి నుంచి వెళ్లిపోతుందటగా : కేటీఆర్



**హైదరాబాద్:** అమరరాజా సంస్థ తెలంగాణ రాష్ట్రాన్ని వీడతామంటూ ప్రకటించటం బాధాకరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్వీట్ చేశారు. రాజకీయాల కోసం రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు పెట్టవద్దన్నారు. బ్రాండ్ తెలంగాణ ఇమేజ్‌కు నష్టం రాకుండా రేవంత్ రెడ్డి చర్యలు చేపట్టాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉండకపోతే రాష్ట్రం నుంచి వెళ్లిపోతామని అమరరాజా సంస్థ చెబుతున్నట్లు వార్తలు వస్తున్నాయని, అదే నిజమైతే చాలా దురదృష్టకరమని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రభుత్వ వైఖరేంటో అర్థంకాక చాలా సంస్థలు రాష్ట్రాన్ని వీడుతున్నాయన్న కేటీఆర్ కేన్స్ టెక్నాలజీ అనే సంస్థ తెలంగాణ నుంచి గుజరాత్‌కు వెళ్లిపోయిందన్నారు. కార్నింగ్ సంస్థ తమ ప్లాంట్‌ను చెన్నైకి తరలించిందన్నారు. ఇప్పుడు అమరరాజా కూడా వెళ్లిపోతానని చెబుతుంటే, ఇది తెలంగాణ బ్రాండ్‌కు తీవ్ర నష్టం చేస్తుందన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టడం ఎంతమాత్రం మంచిది కాదని కేటీఆర్ హితవు పలికారు.

## సీతారామ ప్రాజెక్టు పంపుల ట్రయల్ రన్

### - ఏటా 10 లక్షల ఎకరాలకు నీరు



**హైదరాబాద్** తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్విచ్ ఆన్ చేసి సీతారామ ప్రాజెక్టు పంపుల ట్రయల్ రన్ ప్రారంభించారు. సీతారామ ప్రాజెక్టు పంప్ హౌస్-2ను మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు. భద్రాద్రి సీతారామ ప్రాజెక్టుతో ఏటా 10 లక్షల ఎకరాలకు నీరు అందించనున్నట్లు మంత్రి ఉత్తమ్ తెలిపారు. గోదావరి జలాలతో భద్రాద్రి, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లోని 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలన్నది కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆగస్టు 15న ప్రాజెక్టు 2, 3 లిఫ్ట్ ఇరిగేషన్లను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారని ఆయన స్పష్టం చేశారు. వచ్చే ఏడాది ఆగస్టు 15 నాటికి ఆయకట్టులోని ప్రతి ఎకరానికి నీరందిస్తామని చెప్పారు. ఇటీవల చెప్పినట్లుగానే అదేరోజు సీఎం రేవంత్ రెడ్డి రూ.2 లక్షల వరకు రైతులకు రుణమాఫీ చేసి తీరుతామన్నారు. రీడిజైన్ పేరుతో బీఆర్ఎస్ హయాంలో రూ.8 వేల కోట్లు వృథా చేశారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. రెండు దఫాలు బీఆర్ఎస్ అధికారంలో ఉన్నా, సీతారామ ప్రాజెక్టు పనులు నత్తనడకన సాగాయన్నారు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. జూలూరుపాడు టన్నెల్ పూర్తయితే పాలేరు వరకు గోదావరి జలాలు వస్తాయన్నారు. పంప్ హౌస్‌ల పరిధిలో డిస్ట్రిబ్యూటరీ కాలువలు త్వరగా పూర్తి చేస్తామన్నారు. మొదటి పంపు హౌజ్ ట్రయల్ రన్‌ను గత జూన్‌లో విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. రెండో పంపు హౌజ్ ట్రయల్ రన్‌ను జులై 2న విజయవంతంగా నిర్వహించినట్టు వెల్లడించారు. రైతుల కష్టాలు ఇకపై తొలగిపోయాతాయని అన్నదాతల కళ్లల్లో ఆనందాన్ని చూడడమే తమ లక్ష్యమన్నారు.రాజీవ్ నగర్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, ఇందిరా సాగర్‌లను ఒకే లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌గా విలీనం చేసి భద్రాద్రి సీతారాముడి పేరు మీదుగా సీతారామ ఎత్తిపోతల పథకంగా ప్రభుత్వం పేరు మార్చింది. ఈ ప్రాజెక్టును స్వాతంత్ర దినోత్సవం రోజున సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. గోల్కొండ కోటలో జెండా ఎగురవేసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నాక హెలికాఫ్టర్ ద్వారా ఖమ్మం జిల్లా వైరాకు రేవంత్ రెడ్డి చేరుకుంటారు. సీతారామ ప్రాజెక్టు పంపు హౌస్‌లను స్విచ్ఛాన్ చేసి ప్రారంభిస్తారు. అనంతరం వైరాలో జరగనున్న బహిరంగ సభలో ఆయన పాల్గొనున్నారు.

## ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య రోడ్లు

### - 12 చోట్ల రేడియల్ రహదారులు - అక్కడ భూముల ధరలకు రెక్కలు



**హైదరాబాద్** తెలంగాణకు సూపర్ గేమ్ ఛేంజర్‌గా రీజినల్ రింగు రోడ్డు నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఉన్న ఔటర్ రింగు రోడ్డుకు సుమారు 40 కి.మీ దూరం నుంచి ఈ రహదారిని నిర్మిస్తున్నారు. అయితే హైదరాబాద్ ఔటర్ రింగు రోడ్డు, ఆర్ఆర్ఆర్ మధ్య 2,300 నుంచి 2,400 కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణానికి రేవంత్ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ రహదారులను అనుసంధానం చేసేందుకు రహదారి ప్రణాళిక అవసరమని ప్రభుత్వం సూచించింది. దీంతో రహదారులు, భవనాల శాఖ ఇప్పటికే కసరత్తు మ్నొదలు పెట్టింది. ప్రస్తుతం ఔటర్ రింగు రోడ్డుకు, ఆర్ఆర్ఆర్ మధ్య సుమారు 70 వేల ఎకరాల వరకు భూమి ఉంటుందని రేవంత్ సర్కార్ అంచనా వేస్తోంది. ఈ భూమిని వివిధ క్లస్టర్లుగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆయా ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు వీలుగా అంతర్గతంగా రోడ్లను నిర్మించాల్సి ఉంది. ఆ ప్రాంతంలో రహదారులు, భవనాల శాఖ స్టేట్ రోడ్స్ విభాగానికి సుమారు 2 వేల కిలోమీటర్లు, జాతీయ రహదారులు 4 వందల కిలోమీటర్ల వరకు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వాటిని ఏ విధంగా అభివృద్ధి చేయాలనే అంశంపై ప్రస్తుతం కసరత్తు చేస్తున్నారు. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్‌కు అనుసంధానంగా మ్నొత్తం 12 ప్రాంతాల్లో రేడియల్ రోడ్లు డెవలప్ చేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇదివరకే ప్రకటించారు. అయితే ఆ రహదారులు ఎటు నుంచి ఎటు నిర్మించాలి ? ఎంత వెడల్పు ఉండాలి ? నిర్మాణ వ్యయం అవుతుంది ? తదితర అంశాలపై ప్రస్తుతం అధికారులు కసరత్తు చేస్తున్నారు. వచ్చే రెండు నెలల్లో ఆ కసరత్తు కొలిక్కి వస్తుందని అధికారులు చెబుతున్నారు. కాగా, ఈ రహదారులు నిర్మించే ప్రాంతాల్లో భూముల ధరలకు రెక్కలు రానున్నాయి.ఇప్పటికే హైదరాబాద్ శివారు ముచ్చింతల్‌లో మరో నగరాన్ని నిర్మిస్తామని సీఎం రేవంత్ ప్రకటించారు. హైదరాబాద్, సైబరాబాద్, సికింద్రాబాద్ నగరాలకు ధీటుగా ఈ నగరం ఉంటుందన్నారు. ఇప్పుడు ఆర్ఆర్ఆర్ నిర్మాణం పూర్తి చేసి రేడియల్ రోడ్లు నిర్మిస్తే సగం తెలంగాణ అభివృద్ధి చెందనుంది.

## బిజేపీకి ఆంధ్రా తీపి, తెలంగాణ చేదు అయిందా.?



**హైదరాబాద్** బీజేపీకి ఆంధ్రా తీపి అయితే తెలంగాణ చేదు అయిందా? అని ఎమ్మెల్యే హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణకు కాంగ్రెస్, బీజేపీలు తీరని అన్యాయం చేశాయని విమర్శించారు. సిద్దిపేటలో సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ తెలంగాణను దారుణంగా మోసం చేశాయన్నారు. ఆరు గ్యారెంటీల పేరుతో అబద్దాలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని మండిపడ్డారు. కాంగ్రెస్, బీజేపీలకు చెరో 8 ఎంపీ సీట్లను ఇస్తే తెలంగాణకు చేసిందేమీ లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఏ హామీని అమలు చేయడం లేదని విమర్శించారు. మహిళలకు రూ.2500, పెన్షన్ పెంపు వంటి హామీలను నెరవేర్చలేదన్నారు. బెల్ట్ దుకాణాలను బంద్ చేస్తానన్న కాంగ్రెస్ ఇప్పుడు మళ్లీ గల్లీకో బెల్ట్ దుకాణం తెరిచిందన్నారు. మద్యం విషయంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు విమర్శలు చేసిన కాంగ్రెస్ ఇప్పుడేం చేస్తుందని నిలదీశారు. మద్యంపై బడ్జెట్‌లో గత ఏడాది కంటే ఈసారి రూ.7,300 కోట్లు ఎక్కువగా పెంచారన్నారు. ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తానని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, ఆ హామీ ఎక్కడకు పోయిందో చెప్పాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ నేతలు అబద్దాలు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. మేడిగడ్డలో రెండు పిల్లర్లు కూలిపోతే కాళేశ్వరం ప్రాజెక్టే కూలిపోయినట్లుగా ప్రచారం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం కూలిపోతే రంగనాయకసాగర్‌లోకి నీళ్లు ఎలా వచ్చాయో చెప్పాలన్నారు.

# ఆలేరును రెవిన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలి

## – ఆలేరును రెవిన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలి - ఒక్క రోజు ఉపవాస దీక్ష చేసిన చెక్క వెంకటేష్



**యాదాద్రి భువనగిరి, ఆగస్టు 11, (తెలంగాణ కిరణం ప్రతినిధి):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ,మండల పార్టీ,అన్ని వర్గాల ప్రజలందరిసహకారంతో యాదాద్రి భువనగిరి జిల్లా (భారత కమ్యూనిస్టుపార్టీ) సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ పార్టీ కార్యవర్గ సభ్యులు,ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి చెక్క వెంకటేష్ సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా అలేరు పట్టణంలో అర్టీసి బస్టాండు సమీపములో ని వేణు కాంప్లెక్స్ వద్ద ఉదయం 10-30 నుండి సాయంత్రం 5-00 వరకు ఒకరోజు ఉపవాస దీక్ష నిర్వహించారు.ఒక రోజు ఉపవాసదీక్ష కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా విచ్చేసిన సిపిఐ పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు ప్రారంభించి మాట్లాడారు. గత 2 సంవ త్సరాలుగా ఆలేరు కేంద్రంగా రెవిన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని అన్ని రాజకీయ పార్టీలు ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తున్నారని అన్నారు. గత బి ఆర్ ఎస్ ప్రభుత్వంలో అప్పటి ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి హామీ ఇచ్చినప్పటికి అమలు కాలేదని, ఆలేరు నియోజకవర్గం వెనుకబడిన ప్రాంతమని, ఆలేరు అభివృద్ధికి ఆలేరును రెవిన్యూ డివిజన్ గా ఏర్పాటు చేసినట్లయితే అది సాధ్యపడుతుందని చెప్పారు.ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఆలేరునియోజకవర్గం నుండి ఎమ్మెల్యే గా గెలిచిన ప్రభుత్వవిప్ బీర్ల ఐలయ్య ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి ఆలేరు రెవిన్యూడివిజన్ విషయాన్ని తెలియపరిచి రెవిన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని,వెనుకబడిన ఆలేరు ప్రాంతాన్ని అభివృద్ధి పరచాలని కోరారు. దీక్షకు ఆలేరుపట్టణ కేంద్రంలో ఉన్న వ్యాపార వర్గాలవారు, రాజకీయ పార్టీలు, మేధావులు, విద్యవంతులు అందరు మద్దతు తెలుపారని అన్నారు. అదేవిదంగా ఆలేరు ప్రాంతంలోని పలు గ్రామాలలో కల్వర్టులు శిథిలమైయినాయని,ప్రజల ప్రయాణాలకు ఇబ్బంది కలుగుతుందని,దానికి అవసరమైచోట బ్రిడ్జిలు నిర్మించాలని, ఆలేరుపెద్ద వాగుపై ఉన్న పాత బ్రిడ్జి పూర్తిగా శిథిలావస్తకు చేరుకున్నదని బ్రిడ్జి కూలిపోయే ప్రమాదం ఉన్నందున క్రొత్త బ్రిడ్జి నిర్మించాలని,ఆలేరు పట్టణంలో ఉన్న నిరుపేదలకు స్వంత నివేశస్థలాలు లేక వందల సంఖ్యలో అద్దె ఇండ్లలో ఉంటున్నారని దరఖాస్తులు చేసుకున్న నిరుపేదలకు బీరప్ప గుడి దగ్గర, ఆలేరు మండల పరిధిలో ఉన్న గ్రామలలో స్థలాలు, ఇండ్లు ఇప్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.కార్యక్రమంలో సిపిఐ పార్టీ నాయకులు అయిలి సత్తయ్య,ఆలేరు మండల కార్యదర్శి చౌడబోయిన కనకయ్య, సిపిఐ పార్టీ ఆలేరు పట్టణ కార్యదర్శి గొట్టిపాముల శ్రీనివాస్ రాజు, రైతు సంఘం రాష్ట్ర నాయకులు కొల్లూరు రాజయ్య, చౌడబోయిన పరుశరాములు, పొన్నబోయిన కుమారస్వామి, ఆర్. నర్సింహులు, మాటూరి జానమ్మ, బండి జంగమ్మ, పోతు ప్రవీణ్, దూడల లింగం, తెడ్డు ఆంజనేయులు, గిరబోయిన స్వామి, బొడ్డు ఆంజనేయులు, జంగ సరళ, జాంగీర్ బీ,ఎం డి. హాలీమా బేగం, బాలమణి, లక్ష్మి, గ్యాదపాక లక్ష్మి,పూలమ్మ, రాజు, గుండె మల్లయ్య, జి. లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ఆలేరు రెవిన్యూ డివిజన్ సాధన పోరాట కమిటీ కన్వీనర్ పసుపు నూరి వీరేశం, ఎం డి. సలీం, రాచకొండ జనార్దన్, మంగ నర్సింహులు, కెమిడి ఉప్పలయ్య, తిరునగరి శ్రీనివాస్, యంబ నర్సింహులు, పి. మాధవరెడ్డి, మంచన మల్లేశం, ఎర్ర జాన్సన్, ముల్లక్కల రవి కుమార్,ఎలుగల కుమారస్వామి, కోరుటూరి ఉపేందర్, సాగర్, రాములు, సముద్రాల సత్యం, బొంబాయి రవి,మమత హాస్పిటల్ డాక్టర్ సౌజన్య, డాక్టర్ మురహరి,కామిటికారి కృష్ణ,బొమ్మకంటి బాలరాజు వివిధ రంగాల వారు,పలువురు సంఘీభవం తెలిపారు.

## నిరుద్యోగులను నిండా ముంచారు..

# పెట్టుబడులు పోకుండా చూడాలి

**- ఎమ్మెల్యే కేపీ వివేకానంద**




కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలన్నీ అటకెక్కించిందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. ఇవాళ తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నిరుద్యోగులను నిండా ముంచారని ఆరోపించారు. నిరుద్యోగులు పోరాడుతున్నా బీజేపీనాయకులు మద్దతు ఇవ్వరని.. బీజేపీ నాయకులు ప్రభుత్వాన్ని నిలదీయడం లేదని మండిపడ్డారు. బీఆర్ఎస్ పాలనలో 25 లక్షల మంది ఉపాధి అవకాశాలు కల్పించినం. బీఆర్ఎస్ హయాంలో ఐటీ సెక్టార్‌లో 6లక్షల ఉద్యోగాలు వచ్చాయి. కాంగ్రెస్ పాలనలో అన్నీ దిగజారుతున్నాయి. అమరరాజా కంపెనీ తెలంగాణ నుంచి తరలిపోతామని చెప్తోందని.. ఉన్న పెట్టుబడులు పోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చూడాలని సూచించారు. బీజేపీ నాయకులు భావ దారిద్ర్యంతో ఉన్నారు. భూములులాక్కుంటున్నారని కొడంగల్ రైతులు ఆందోళన చేస్తున్నారు. కేంద్ర హోంశాఖ సహాయమంత్రి.. రేవంత్‌కు సహాయ మంత్రిగా మారిపోయారని, రేవంత్ రెడ్డికి కోవర్టుగా పనిచేస్తున్నారని విమర్శించారు. అమెరికాలో సోదరుడి కంపెనీతో రేవంత్ అగ్రిమెంట్ చేసుకున్నరు. కేంద్ర హోంశాఖ సహాయమంత్రి ఆ ఒప్పందాన్ని సమర్థించారు. ఆ ఒప్పందం ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్ కిందికి వస్తుంది. సుంకిశాల ప్రమాదం చిన్నది అన్నట్టుగా చూపిస్తున్నరు.. కాంట్రాక్ట్ ఏజెన్సీని బ్లాక్ లిస్టులో పెట్టాలి. 2వ తేదీన సుంకిశాల ప్రమాదం జరిగింది. సోషల్ మీడియాలో వస్తే కానీ ప్రభుత్వానికి తెలియలేదు. ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా ఉందో దీన్ని బట్టే అర్థమవుతోందని ఎమ్మెల్యే వివేకానంద పేర్కొన్నారు.

## వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీను వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న దివ్వెల మాధురికి రోడ్డు ప్రమాదం.. ఆస్పత్రికి తరలింపు



అమరావతి : ఏపీ వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీను తో వివాహేతర సంబంధం ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసీపీ నాయకురాలు దివ్వెల మాధురి రోడ్డు ప్రమాదాని కి గురైంది. ఆదివారం ఆమె ప్రయాణిస్తున్న కారు ఆగిఉన్న మరో కారును ఢీకొట్టడంతో ఆమెకు గాయాలయ్యాయి.శ్రీకాకుళం జిల్లా పలాస మండలం లక్ష్మీపురం టోల్‌గేట్ వద్ద జరిగిన ఘటన జరిగింది. గాయపడ్డ మాధురిని పలాస ఆస్పత్రికి తరలించారు. ఆమె ఆస్పత్రిలో మాట్లాడుతూ 'నేను డిప్రెషన్‌లో ఉన్న .. చనిపోయేందుకే బయటకి వచ్చానని' పేర్కొన్నారు.గత రెండురోజులుగా ఏపీలో హాట్‌టాపిక్‌గా మారిన ఎమ్మెల్సీ వ్యవహారంలో దువ్వాడ శ్రీను భార్య శ్రీవాణి మాధురిపై తీవ్ర ఆరోపణలు చేసింది. తన భర్తతో వివాహేతర సంబంధం కొనసాగిస్తుందని ఆరోపిస్తూ శ్రీను ఇంటిపై కూతుళ్లతో కలిసి దాడి చేసింది. దివ్వెల మాధురి అనే మహిళతో సంబంధం పెట్టుకుని తమను వదిలేశారని దువ్వాడ శ్రీనివాస్ కుమార్తెలు ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో తనపై వస్తున్న ఆరోపణలపై దివ్వెల మాధురి కూడా స్పందించారు. దువ్వాడ శ్రీనివాస్‌ను తాను ట్రాప్ చేయలేదని స్పష్టం చేశారు. తననే దువ్వాడ శ్రీనివాస్ సతీమణి వాణి రాజకీయంగా తనను ట్రాప్ చేసిందని ఆరోపించారు. ఎమ్మెల్యే టికెట్ పొందడం కోసం తనను పావుగా వాడుకుందని తెలిపారు. వాణినే తనను రాజకీయాల్లోకి తీసుకొచ్చారని. ఇప్పుడు తానెవరో తెలియదని అంటుందని విమర్శించారు. దువ్వాడ శ్రీనివాస్‌కు, వాణికి మధ్య ఏవైనా విబేధాలు ఉంటే వారే మాట్లాడుకుని పరిష్కరించుకోవాలని సూచించారు. స్వార్థంతో వాణి తనపై నిందలు వేశారని.. తన వైవాహిక జీవితాన్ని కూడా దెబ్బతీసిందని మాధురి ఆరోపించారు. ఆ బాధతో ఆత్మహత్య చేసుకోవాలని అనుకున్నప్పుడు దువ్వాడ శ్రీను తనకు అండగా నిలిచారని పేర్కొన్నారు. ఓ ఫ్రెండ్‌లా, కేర్‌టేకర్‌లా తనతో ఉన్నారని చెప్పారు. ప్రస్తుతం తామిద్దరం కలిసే ఉంటున్నామని స్పష్టం చేశారు. అయితే తమది సహజీవనం కాదని.. అడల్ట్రీ రిలేషన్ అని పేర్కొన్నారు.

# డాక్టర్ సురసుర రాధాకృష్ణ"కు నల్లవజ్రం 2024 కీర్తి ఘన సత్కారం







సిరిసిల్ల, ఆగస్టు11, (తెలంగాణ కిరణం విలేఖరి): వైద్యరంగంలో విశిష్ట సేవలను గుర్తించి వివిధ స్వచ్ఛంద సంస్థలు వారి వైద్య సేవలతో నిరుపేదలకు కేవలం పది రూపాయల ఫీజుతో ఆపదలో ఉన్న వారందరికీ తక్కువ ఖర్చుతో గ్రామీణ ప్రాంతాలలో ఇంటింటి వైద్య సేవలను గుర్తించి తార ఆర్ట్స్ అకాడమీ హైదరాబాద్ వారు గోదావరిఖని రామగుండంలో నిర్వహించిన అవార్డ్స్ కార్యక్రమం లో డాక్టర్ సురసుర రాధాకృష్ణ పల్మనాలజిస్ట్ సిరిసిల్లకి శనివారం రోజున రాత్రి 10 గంటలకు వేదిక ఈడిసి ఆడిటోరియం ఎన్ టి పి సి రామగుండంలో నిర్వహించిన కార్యక్రమంలో చీఫ్ గెస్ట్ హానరబుల్ హైకోర్టు జడ్జి ఏ.వి లక్ష్మీ నారాయన్ మాజీ మంత్రి శ్రీ కొప్పుల ఈశ్వర్ అడిషనల్ డి సి పి సి. రాజు రామగుండం కమిషనరేట్ ఏ సి పి ప్రతాప్ ఫేమస్ ఇండియన్ మిమిక్రీ ఆర్టిస్ట్ యాక్టర్ శివారెడ్డి బిజెపి నాయకురాలు సంధ్యారాణి తార ఆర్ట్స్ అధినేత సంకే రమేష్ చేతుల మీదుగా జాతీయస్థాయిలో నల్లవజ్ర కీర్తి పురస్కారాన్ని అందుకున్నారు. ఇందుకు అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

## విశాఖ ప్రైవేట్ ఆస్పత్రిలో అగ్నిప్రమాదం..

# సీఈవో గది దగ్ధం

అమరావతి : విశాఖపట్నం లో వారం రోజుల వ్యవధిల్లో రెండు ఆస్పత్రుల్లో అగ్నిప్రమాద ఘటనలు జరుగడం పట్ల రోగులు కలవర పాటుకు గురవుతున్నారు. మెడికవర్ ఆస్పత్రిలో అగ్నిప్రమాద ఘటనను మరవకముందే ఆదివారం విశాఖ సెవెన్‌హిల్స్ ఆస్పత్రి ఐదో అంతస్తులో అగ్నిప్రమాదం జరిగింది. దట్టంగా పొగలు అంటుకుని మంటలు వ్యాపించాయి. ఈ మంటల్లో ఆస్పత్రి సీఈవో గది పూర్తిగా దగ్ధమయ్యింది. ఈ ప్రమాదానికి షార్ట్‌సర్క్యూటే కారణమని అనుమానిస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం అగ్నిప్రమాదం జరిగిన సెవెన్‌హిల్స్ ఆస్పత్రిని విశాఖ సీపీ శంకబ్రత బాగ్చీ స్పందించారు. ఆయన మాట్లాడుతూ అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను ఆర్పివేశారని తెలిపారు. రోగులకు ఎలాంటి ముప్పులేదని ఆస్పత్రి యాజమాన్యం తెలిపిందని వివరించారు. అన్ని ఆస్పత్రుల్లో అగ్నిప్రమాద నివారణ చర్యలు తీసుకోవాలని, రెండు వారాల్లో అన్ని ఆస్పత్రులు భద్రత ప్రమాణాలు పెంచుకోవాలి సూచించారు.

## లేడీస్ వాష్‌రూమ్ చెత్తడబ్బాలో మొబైల్.. ఫ్లైట్ మోడ్‌లో పెట్టి వీడియో రికార్డ్



బెంగళూరు : బెంగళూరులోని ఓ ప్రముఖ కాఫీ షాపులో పని చేస్తున్న ఓ ఉద్యోగి అత్యంత నీచమైన చర్యకు పాల్పడ్డాడు. లేడీస్ వాష్‌రూమ్‌లోని డస్ట్‌బిన్‌లో సెల్‌ఫోన్‌ను ఉంచాడు. ఆ మొబైల్‌ను ఫ్లైట్ మోడ్‌లో ఉంచి, కెమెరాను ఆన్ చేసి వీడియో రికార్డు చేశాడు. దీన్ని గమనించిన ఓ మహిళ.. కాఫీ షాపు యాజమాన్యానికి ఫిర్యాదు చేసింది. అయితే ఈ ఫోన్ కెమెరా దాదాపు రెండు గంటల పాటు రికార్డింగ్ మోడ్‌లో ఉన్నట్లు తేలింది. అయితే కెమెరాకు ఏమీ అడ్డురాకుండా సంచికి చిన్న రంధ్రం చేసి టాయిలెట్ సీట్ దిశగా ఉంచినట్లు బాధిత మహిళ తెలిపారు. ఈ వ్యవహారాన్ని గ్యాంగ్స్ ఆఫ్ సినీపుర్ పేరిట ఉన్న ఓ ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్‌లో పోస్టు చేశారు. బీఈఎల్ రోడ్‌లోని థర్డ్ వేవ్ కాఫీ ఔట్‌లెట్‌లో ఈ ఘటన చోటు చేసుకున్నట్లు ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పేర్కొన్నారు. బెంగళూరులోని థర్డ్ వేవ్ కాఫీ ఔట్‌లెట్‌లో నేను ఉన్నాను. ఆ సమయంలోనే ఓ మహిళకు వాష్‌రూమ్‌లోని డస్ట్‌బిన్‌లో మొబైల్ కనిపించిందని ఆమె తెలిపింది. ఫోన్ కనిపించకుండా చాలా జాగ్రత్తగా అందులో దాచిపెట్టారు. దాదాపు 2 గంటల పాటు వీడియో రికార్డ్ అయింది. ఫ్లైట్ మోడ్‌లో పెట్టడం వల్ల అక్కడ మొబైల్ ఉన్నట్టు ఎవరికీ తెలియలేదు. కెమెరా మాత్రం కనిపించేలా డస్ట్ బిన్‌కి ఓ రంధ్రం పెట్టారు. కెమెరాను గుర్తించిన ఆ మహిళ కాఫీ షాపు యాజమాన్యానికి చెప్పింది. అక్కడ పని చేస్తున్న ఉద్యోగి ఈ పని చేసినట్టు తేలింది. పోలీసులు వెంటనే వచ్చి ఆ వ్యక్తిని విచారించారు. కఠిన చర్యలు తీసుకుంటామని కాఫీ షాపు యాజమాన్యం చెప్పినట్లు గ్యాంగ్స్ ఆఫ్ సినీపుర్ ఇన్‌స్టా ఖాతాలో పేర్కొన్నారు. ఈ ఘటనపై సదరు కాఫీ విక్రయ సంస్థ స్పందించింది. జరిగిన ఘటనపై విచారం వ్యక్తం చేసింది. తమ ఔట్‌లెట్లలో ఇలాంటి దుశ్చర్యలను ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని స్పష్టం చేసింది. సదరు వ్యక్తిని వెంటనే ఉద్యోగంలో నుంచి తీసేసినట్లు పేర్కొంది. ఈ సంస్థకు దేశ వ్యాప్తంగా ఔట్‌లెట్లు ఉండడం గమనార్హం. ఈ దారుణానికి పాల్పడ్డ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు.

## హిండెన్‌బర్గ్ నివేదికపై జ్యోతిరాదిత్య సింధియా కీలక వ్యాఖ్యలు




అదానీ గ్రూప్‌పై ఏడాదిన్నర కిందట సంచలన ఆరోపణలు చేసిన మార్కెట్ రీసెర్చ్ కంపెనీ హిండెన్‌బర్గ్ తాజా ఆరోపణలు కలకం రేపుతున్నాయి. అదానీ గ్రూప్ అక్రమంగా నిధుల మళ్లింపునకు ఉపయోగించిన విదేశీ ఫండ్లలో సెబీ చీఫ్ మాధవి పురి బుచ్, ఆమె భర్త ధవళ్ బుచ్‌కు వాటాలున్నాయని లేటెస్ట్ రిపోర్ట్‌లో పేర్కొనడం దుమారం రేపుతోంది. కాగా హిండెన్‌బర్గ్ నివేదికపై బీజేపీ నేత, కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా భగ్గుమన్నారు. గ్వాలియర్‌లో కేంద్ర మంత్రి ఆదివారం మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నదని, దేశంలో అరాచకం వ్యాప్తి చేయడమే ఆ పార్టీ పనిగా పెట్టుకుందని దుయ్యబట్టారు. వివాదాస్పద వ్యవహారాల్లో దేశం నలిగిపోవాలని మాత్రమే ఆ పార్టీ కోరుకుంటుందని మండిపడ్డారు. దేశాన్ని పురోగతి పథంలో, అభివృద్ధి మార్గాన నడిపించాలని ప్రధాని నరేంద్ర మోదీతో పాటు ప్రతి బీజేపీ కార్యకర్తా కోరుకుంటున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మాత్రం దేశ ప్రతిష్టను దిగజార్చి ప్రతి ఒక్కరినీ చీకట్లో మగ్గేలా చేస్తున్నదని ఆరోపించారు. కాంగ్రెస్ వైఖరి తొలి నుంచీ ఇదేనని, విచ్ఛిన్నకర విధానాలతోనే ఆ పార్టీ ముందుకెళుతున్నదని జ్యోతిరాదిత్య సింధియా పేర్కొన్నారు.

## దుబాయ్ టు హైదరాబాద్.. ఎయిర్‌పోర్టులో భారీగా బంగారం సీజ్



శంషాబాద్ ఎయిర్‌పోర్టులో భారీ మొత్తంలో బంగారం పట్టుబడ్డది. సుమారు 1.4 కిలోల బంగారాన్ని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన బంగారం విలువ సుమారు రూ.కోటి వరకు ఉంటుందని డీఆర్ఐ (డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్) అధికారులు తెలిపారు. దుబాయ్ నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా.. బంగారం తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు తెలిపిన అధికారులు.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు.

# రిజర్వేషన్, రాజ్యాంగం, కుల నిర్మూలనకు ఆరెస్సెస్ వ్యతిరేకం

**- మాణిక్యం ఠాగూర్**




కుల వ్యవస్థ సోపాన క్రమం కొనసాగాలని ఆరెస్సెస్ కోరుకుంటుందని కాంగ్రెస్ ఎంపీ మాణిక్యం ఠాగూర్ అన్నారు. అగ్ర కులాల వారు ముందువరసలో ఓబీసీలు, ఎస్సీలు దిగువ స్థాయిలో ఉండే వ్యవస్థను ఆరెస్సెస్ అనుసరిస్తుందని చెప్పారు. పార్లమెంట్‌లో బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ ఇదే తీరులో మాట్లాడారని పేర్కొన్నారు.కుల వ్యవస్థ కొనసాగాలన్నదే కాషాయ పాలకుల విధానమని స్పష్టం చేశారు. న్యాయపరమైన ప్రక్రియతో కుల వ్యవస్థను పెకిలించివేయాలని ఆకాంక్షించే క్రమంలోనే తాము కుల గణనను కోరుతున్నామని చెప్పారు. అప్పుడే నిజమైన వివక్షను పరిష్కరించడం సాధ్యమవుతుందని అన్నారు. రిజర్వేషన్, రాజ్యాంగం, కుల నిర్మూలనకు ఆరెస్సెస్ వ్యతిరేకమని ఆయన పేర్కొన్నారు. కుల వ్యవస్థ వేళ్లూనుకునేందుకు రాజ్యాంగంలో మార్పులను ఆరెస్సెస్ కోరుకుంటున్నదని అన్నారు. భారత్ ఏకమత రాజ్యంగా ఉండాలని ఆరెస్సెస్ ఆకాంక్ష అని చెప్పారు. ఈ రకమైన ఆరెస్సెస్ ఆలోచనా ధోరణి మహాత్మా గాంధీ, బాబాసాహెబ్ అంబేద్కర్‌ల ఆశయాలకు విరుద్ధమని మాణిక్యం ఠాగూర్ వివరించారు. ఆరెస్సెస్ విధానాలను కాషాయ పాలకులు అనుసరిస్తున్నారని ఆయన మండిపడ్డారు.

## ఏపీ హోం మంత్రి అనితకు తప్పిన పెను ప్రమాదం



అమరావతి : ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత కు పెను ప్రమాదం తృటిలో తప్పింది. మంత్రి అధికారిక కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆదివారం విజయవాడ నుంచి పశ్చిమగోదావరి జిల్లా పెంటపాడు మండలం అలంపురం సైనిక పాఠశాలలో విగ్రహం ఆవిష్కరణకు బయలు దేరారు. ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం కైకరం జాతీయరహదారి వాహనం వద్ద ఆమె కారు ప్రమాదానికి గురైంది. బైక్‌ను తప్పించే సమయంలో మంత్రి ఎస్కార్ట్ వాహన డ్రైవర్ సడెన్‌గా బ్రేక్ వేశారు. దీంతో ఆ వాహనాన్ని మంత్రి ప్రయాణిస్తున్న కారు వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో మంత్రి కారు, ఎస్కార్ట్ వాహనం స్వల్పంగా దెబ్బతిన్నాయి. ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదని పోలీసులు తెలిపారు.

## ఘనంగా భౌరంపేట్ "బంగారు మైసమ్మ తల్లి" బోనాలు





కుత్బుల్లాపూర్,ఆగస్టు 11(తెలంగాణ కిరణం ప్రతినిధి):కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి భౌరంపేట్ లో శ్రీ శ్రీ శ్రీ బంగారు మైసమ్మ తల్లి 11వ వార్షికోత్సవం, ఆలయ బోనాల పండుగలో ఐశ్వర్యాంబిక తపోవనం త్రిశక్తి పీఠం శ్రీ శ్రీ శ్రీ శ్యక్తానంద గిరి స్వామి, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపి.వివేకానంద ప్రజాప్రతినిధులు ముఖ్య అతిధులుగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మవారి పూజలో పాల్గొనడం సంతోషంగా ఉందని అన్నారు. అమ్మవారి కృప అందరిపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నట్టు తెలియజేసారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ పట్టివేత




జమ్మికుంట, ఆగస్టు 11 (తెలంగాణ కిరణం విలేఖరి) : ఆదివారం రోజున ఉదయం 06:30 గంటలకు, ఎస్సై తన సిబ్బందితో, జమ్మికుంట లో పెట్రోలింగ్ చేస్తుండగా, కోరపల్లి లో ఇసుక ట్రాక్టర్ ఎదురురాగ, అట్టి ట్రాక్టర్ కు ఇసుక తరలించడనికి ఎలాంటి అనుమతి పత్రాలు లేనందున, పోలీస్ స్టేషన్ కు తీసుకువెళ్లి, కేసు నమోదు చేయనైనది. డ్రైవర్ మరియు ఓనర్ పెరు గుండారపు కుమారస్వామి, పోతిరెడ్డిపల్లి గ్రామం ల పై కేసు నమోదు చేసినట్లు జమ్మికుంట పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

## 14 క్వింటాల రేషన్ బియ్యం పట్టివేత



**జమ్మికుంట, ఆగస్టు 11 (తెలంగాణ కిరణం విలేఖరి) :** జమ్మికుంట మండలం, బిజిగిరి షరీఫ్ గ్రామంలో, ఆదివారం రోజున ఉదయం సుమారు 11 గంటల ప్రాంతంలో, కానిస్టేబుల్ షణ్ముఖరావు, హెూంగార్డు సతీష్ లు, గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, అనుమాన స్పదంగా బండారి స్వామి తండ్రి పేరు రాజయ్య, వంగర గ్రామం, రేవెల్లి కుమార్ ఓదెల మండలం, పోత్కాపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు తమ ద్విచక్ర వాహనం పై బియ్యం మూటలు వేసుకుని రావడం చూసి, అతనిని ప్రశ్నించగా, తాను గ్రామాలలో రేషన్ బియ్యం కొనుగోలు చేసి, ఇక్కడ ఒకచోట నిలువ చేసుకున్నామని తెలుపగా, ఆ స్థలానికి వెళ్లి వారు అక్రమంగా నిల్వ ఉంచిన 14 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకొని, కేసు నమోదు చేయడం జరిగింది.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన టీపీసీసీ మెంబెర్ పత్తి కృష్ణరెడ్డి



**జమ్మికుంట, ఆగస్టు 11 (తెలంగాణ కిరణం విలేఖరి) :** ఆదివారం రోజున, హుజురాబాద్ ఏసీపీ శ్రీనివాస్ జీ కూతురు పెళ్ళికి వెళ్లి ఆశీర్వదించిన టీపీసీసీ మెంబెర్ పత్తి కృష్ణరెడ్డి, మాజీ సింగల్ విండో అధ్యక్షులు గూడూరు స్వామి రెడ్డి, చెల్పూర్ మాజీ సర్పంచ్ నేరెళ్ల మహేందర్ గౌడ్, జమ్మికుంట కౌన్సిలర్ శ్రీపతి నరేష్, జమ్మికుంట పట్టణ అధ్యక్షులు సుంకరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# వర్షాకాలంలో వైరల్ జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండండి

**- గ్రామాల్లో పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టండి**

**- ప్రభుత్వం ప్రవేశ పెట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ పాల్గొనాలి**

**- గ్రామాల్లో ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఎంపిడిఓలకు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి ప్రణవ్ సూచన**

**హుజురాబాద్, ఆగస్టు 11 (తెలంగాణ కిరణం విలేఖరి) :** వర్షాకాలం సందర్భంగా, గ్రామాలలో డెంగ్యూ, మలేరియా లాంటి వైరల్ జ్వరాలు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఆ భాధ్యత ఆయా మండలాల ఎంపిడిఓలు తీసుకోవాలని, హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ప్రణవ్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. జమ్మికుంట, హుజురాబాద్ మున్సిపల్ ప్రాంతాల్లో, ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసి, అవగాహన కల్పించాలని కోరారు. ప్రతీ ఒక్కరూ ఇంటి పరిసరాల్లో చెత్త, నీరు నిల్వఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అంతేకాకుండా, గ్రామాల్లో పారిశుధ్యం పై ఎంపిడిఓ లు, ఆయా శాఖల అధికారులతో సమన్వయపరుస్తూ, ప్రత్యేక దృష్టి పెట్టాలని, మిషన్ భగీరథ ద్వారా వచ్చే నీటిని, గ్రామాల్లో నీటి సరఫరా చేసే ట్యాంకులను, మినరల్ వాటర్ ప్లాంట్ లను శుభ్రంగా ఉంచుకోవాలనీ ప్రణవ్ సూచించారు. వీలైనంత వరకు ప్రజలకు అవగాహన కల్పించేలా చేయాలనీ కోరారు. వర్షాకాలం ప్రభుత్వం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం పట్ల, అందరికీ అవగాహనపరచాలని, దీన్ని సక్రమంగా అమలు చేస్తే వైరల్ జ్వరాల నుండి తప్పించుకోవచ్చని సూచన చేశారు.



# గోదావరిఖనిలో సెంట్రల్ లైబ్రరీ ఏర్పాటు చేయాలి

**- రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని 50 డివిజన్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అభివృద్ధి పనులు చేపట్టాలి**

**- వర్షాకాలం కావడంతో రోగాల బారిన పడకుండా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలి - ఐక్య స్వచ్ఛంద సంఘాలు**

**(గోదావరిఖని) ఆగస్టు 11 తెలంగాణ కిరణం విలేకరి:** రామగుండం నియోజకవర్గం ఐక్య స్వచ్ఛంద సంస్థల వేదిక ఆధ్వర్యంలో మార్కండేయ కాలనీలోని పల్లెర్ల రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా ఐక్య స్వచ్ఛంద సంస్థల వేదిక అధ్యక్షులు మంచి కట్ల దయాకర్ హాజరై మాట్లాడుతూ రామగుండం నగర పాలక సంస్థలు అనేకమైనటువంటి సమస్యలున్నప్పటికీ అవి నెరవేర్చడంలో సంబంధించిన అధికారులు విఫలమవుతున్నారని వారు అన్నారు. రామగుండం నియోజకవర్గంలో అనేకమంది నిరుద్యోగులు వివిధ ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం కోచింగ్ సెంటర్లలో శిక్షణ తీసుకుంటున్నారు. అందులో చాలామంది పేద మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారు ఉన్నారు అప్పులు చేసి వివిధ ఉద్యోగాల కోసం పుస్తకాలతో కోచింగ్ సెంటర్లలో స్టీలు పడుతున్నారు. మన కార్పొరేషన్ పరిధిలోనే నిరుద్యోగుల కోసం మరియు విద్యార్థుల కోసం సెంట్రల్ లైబ్రరీ ఏర్పాటు చేయాలని కార్పొరేషన్ పరిధిలో ఉన్న ప్రతి ఒక్కరు తమ ఇంటి పన్ను లో లైబ్రెరీ సెస్ కు ఎనిమిది శాతం పన్ను చెల్లిస్తున్నారని కావున దానిలో భాగంగా ఈ ప్రాంతంలో నిరుద్యోగుల కోసం సెంట్రల్ లైబ్రరీ ఏర్పాటు చేయాలని మద్దెల దినేష్ పేర్కొన్నారు. మద్దెల దినేష్ మాట్లాడుతూ అదేవిధంగా వర్షా కాలం రావడంతో 50 డివిజన్లో ఎక్కడి చెత్త అక్కడే పేర్కొని ప్రజలు నానా రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని రోడ్లమీద గల్లీలలో పిల్లలు స్కూల్కు వెళ్తున్న, మహిళలు ఉద్యోగాలకు వెళు న్న, ఇతర పనుల మీద బయటికి వెళ్తే ఎక్కడ చూసినా కుక్కల బెడద ఉంటున్నప్పటికీ ప్రజలు బయటికి వెళ్దామంటే భయభ్రాంతులకు గురవుతున్నారని వాటిని నిర్మూలించాల్సిన అవసరం మున్సిపల్ కార్పొరేషన్ సంబంధించిన అధికారులపై ఉందన్నారు. అదేవిధంగా అన్ని డివిజన్లో రోడ్లు మొత్తం పూర్తిగా చెడిపోయి నడవనికే ఇబ్బందికరంగా ఉన్నదని అలాగే నూతన రోడ్లు వేయాలని, చెత్తాచెదారంతో నిండిపోయి పందులు స్వైర విహారం చేస్తున్న నగరపాలక సంస్థ పట్టించుకోకపోవడం బాధాకరమని గోలివాడ చంద్రకళ గారు ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా వర్షాకాలం రావడంతో చిన్నాచితక పనులు చేసుకుంటున్న పూరి గుడిసెల్లో ఉంటున్న వారికి ప్రభుత్వం అండగా నిలవాల్సి ఉందని వారికి మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని వివిధ స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు హాస్టల్లో శిథిలావస్థకు చేరుకొని అనేక రకాలుగా విద్యార్థు లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాటిని సందర్శించి ఉన్నతాధి కారుల దృష్టికి తీసుకెల్తమని సుద్దాల అనూరాజ్ అన్నారు. రామగుండం నియోజకవర్గంలో పేద నిరుపేద ప్రజలు ఎదుర్కొం టున్న సమస్యల పైన అదే విధంగా ప్రభుత్వం నుండి వచ్చే పథకాలు నిలిచిపోయిన సందర్భంగా వారికి అండగా నిలవాలని స్వచ్ఛంద సంస్థల సమావేశంలో పలు తీర్మానాలు చేయడం జరిగిందన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో వివిధ స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు నసీమా, శ్రీదేవి, శిరీష, సుజాత, సరిత, మందల రామ దేవి తో పాటు తదితరులు పాల్గొన్నారు.



## కళాకారులకు గని.. "గోదావరిఖని"

**- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్**



**(గోదావరిఖని) ఆగస్టు 11 తెలంగాణ కిరణం విలేకరి:** గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతం కళాకారులకు మహా గని అని ఇక్కడి నుండి కళాకారులతోపాటు ఎంతోమంది ఉన్నత స్థాయికి ఎదిగి వివిధ రంగాలలో సేవలు అందిస్తున్నారని, వారిని తార ఆర్ట్స్ అకాడమీ గుర్తించి నల్ల వజ్రం పురస్కారం అందించే కార్యక్రమం అభినంద నీయమని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు, శనివారం రాత్రి రామగుండం ఎన్టిపిసి ఆడిటోరియంలో నల్ల వజ్రం పురస్కారం అవార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు, ఇదే సందర్భంగా తెలంగాణ ఆంధ్ర తో పాటు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన జానపద సాంప్రదాయ నృత్య పోటీలను శని ఆదివారం రెండు రోజులు చేపట్టడం హర్షనీయమని అన్నారు.

రామగుండం గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో ప్రముఖ నటుడు మిమిక్రీ ఆర్టిస్ట్ శివారెడ్డి తో పాటు ఇదే తరహాలో ఎంతోమంది సినిమా టీవీ నటులతో పాటు గాయని గాయకులు కళా రంగంలో మంచి గుర్తింపు పొంది సేవలందిస్తున్నారని అన్నారు, అంతేకాక కవులు రచయితలు డాక్టర్లు న్యాయవాదుల తోపాటు దేశ అత్యున్నత ఐఏఎస్ అధికారులు కూడా కూడా గోదావరిఖని రామగుండం పారిశ్రామిక ప్రాంతం నుండి ఎదిగి సేవలందిస్తున్నారని అన్నారు, ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిసిపి రాజు మాట్లాడుతూ పిల్లల తల్లిదండ్రులు బాల్యం నుండే వారిని కళా రంగంతో పాటు ఉన్నత స్థాయిలో ఎదిగే విధంగా కృషి చేయాలని సూచించారు ఏ సిపి ప్రతాప్ మాట్లాడుతూ ఈ ప్రాంతానికి చెందిన కవులు రచయితలు కళాకారుల తోపాటు వివిధ రంగాల వారిని గుర్తించి ఆత్మీయంగా సన్మానించ డం గొప్ప కార్యక్రమాన్ని కొనియాడారు,

ప్రముఖ నటుడు శివారెడ్డి మాట్లాడుతూ తాను రామగుండం పారిశ్రామిక ప్రాంత బిడ్డనని తన బాల్యం నుండి అనేక కష్టాలను ఎదుర్కొంటూ ఈ స్థాయికి రావడం ప్రజలందరి ఆశీర్వాదమేనని అన్నారు ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోరు కంటి చందర్, రామలింగారెడ్డి సంకన రాజేష్ బిజెపి అధ్యక్షురాలు కందుల సంధ్యారాణి, శ్రీనివాస్ యాదవ్ మేజిక్ రాజా ప్రవీణ్ స్వామి ప్రముఖ గాయకుడు దయా నర్సింగ్ తోపాటు పలువురు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మంత్రి పొన్నం, ప్రణవ్





**హుజురాబాద్, ఆగస్టు 11 (తెలంగాణ కిరణం విలేఖరి) :** హుజురాబాద్ ఏసిపి శ్రీనివాస్ జి కుమార్తె వివాహం హన్మకొండలోని జరగగా, రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి వొడితల ప్రణవ్ పాల్గొని, నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా నూతన వధూవరులు చక్కటి దంపత్యాన్ని కొనసాగించా లని, జీవితంలో మరింత ముందుకు వెళ్లాలని వారు ఆకాక్షించారు.

## సర్వాయి పాపన్న జయంతిని
# ఘనంగా నిర్వహించాలి

**- సర్వాయి పాపన్న గీతా కార్మిక సంఘం మండల అధ్యక్షుడు పూదరి విజయ్**



జమ్మికుంట, ఆగస్టు 11 (తెలంగాణ కిరణం విలేఖరి) : ఈ నెల 18వ తారీఖున జరిగే సర్వాయి పాపన్న 374వ జయంతి, గ్రామ గ్రామాన, వాడవాడల ఘనంగా నిర్వహించాలని, సర్వాయి పాపన్న గీతా కార్మిక సంఘం మండల అధ్యక్షుడు పూదరి విజయ్ పిలుపునిచ్చారు. జమ్మికుంట పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశానికి ముఖ్య అతిథులుగా కరీంనగర్ జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు ముత్యం శంకర్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి దొమ్మటి రాజమల్లు గౌడ్ పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ బడుగు, బలహీనుల కోసం పోరాడిన గొప్ప వ్యక్తి సర్వాయి పాపన్న అని, అలాంటి వ్యక్తి జన్మదిన ఘనంగా నిర్వహించుకోవాలని కోరారు. రానున్న రోజుల్లో గీత కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వా నికి తమ సమస్యలను తెలుపుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో, ఇల్లంతకుంట మండల అధ్యక్షుడు మూటబోతుల దేవేందర్ గౌడ్, గౌడ సంఘం సీనియర్ నాయకులు బుర్ర నర్సయ్య గౌడ్, పూదరి శ్రీనివాస్ గౌడ్, మోతుకూరి శ్రీనివాస్ గౌడ్, దాసరి రామ్మూర్తి గౌడ్, దొమ్మటి రాజు గౌడ్, శ్రీపతి సురేష్ గౌడ్, పచ్చమట్ల మొగిలి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వీర ఆంజనేయస్వామి దేవాలయంలో
# గజస్తంభాన్ని ఏర్పాటు

**- గజస్తభం ఎంతో శుభదాయకం**

**- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కె.యం.ప్రతాప్**



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 11 (తెలంగాణ కిరణం ప్రతినిధి):**127 రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని నందానగర్ లో శ్రీ వీర ఆంజనేయ స్వామి ఆలయంలో ఆలయ కమిటీ వారు ఏర్పాటు చేసిన ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమానికి ఆలయ కమిటీ వారి ఆహ్వానం మేరకు ముఖ్యఅతిథిగా రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కె.యం.ప్రతాప్ విచ్చేసి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ, పురాతనమైన శ్రీ వీర ఆంజనేయస్వామి దేవాలయంలో గజ స్తంభాన్ని ఏర్పాటు చేసుకోవడం ఎంతో శుభదాయకమన్నారు.నందా నగర్ వాసులకు,చుట్టుపక్కల ఉన్న బస్తీ వాసులకు ఆయురారోగ్యాలు, అష్ట ఐశ్వర్యాలు కలిగించాలని భగవంతుని వేడుకున్నానన్నారు. ఈ కార్యక్రమంలో,శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయ కమిటీ అధ్యక్షులు హరిబాబు, ప్రధాన కార్యదర్శి మురళీకృష్ణ, సంక్షేమ సంఘం అధ్యక్షులు బూడిద కార్తీక్ గౌడ్,శంకర్, దాసు, బాబుమియా, కృష్ణ,సురేష్, సాయి కిరణ్ గౌడ్, రాజు గౌడ్, లక్ష్మణ్,భాగ్య,లక్ష్మీ,ప్రభ, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

## దేవమ్మ బస్తీలోని అమ్మవారి
# ఆలయం వద్ద అన్నదానం

**- పాల్గొన్న కొలుకుల జైహింద్**



కుత్బుల్లాపూర్, ఆగస్టు 11 (తెలంగాణ కిరణం ప్రతినిధి):జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని దేవమ్మ బస్తీలో బోనాల పండుగ సందర్భంగా అమ్మవారికి సమర్పించిన ఓడి బియ్యం తో ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్యఅతిథిగా బి.ఆర్.ఎస్ నాయకులు కొలుకుల జైహింద్ హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జైహింద్ మాట్లాడుతూ అమ్మవారి ఒడిబియ్యంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించిన నిర్వాహకులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాగరాజు. మహేందర్ గౌడ్. రాములు కిట్టు. సత్యరాజు. మైలారం రాజు, శ్రీకాంత్. కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## కొలన్ హన్మంత్ రెడ్డి స్వగృహమునందు ఫలహారం
## బండి ఊరేగింపులో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



కుత్బుల్లాపూర్, ఆగస్టు 11 (తెలంగాణ కిరణం ప్రతినిధి):శ్రావణ మాస బోనాల పండుగ సందర్భంగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరధిలోని బాచుపల్లి లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి స్వగృహమునందు ఫలహారం బండి ఊరేగింపులో ముఖ్యఅతిధులుగా మాజీ ఎమ్మెల్యే మైనాంపల్లి హన్మంత్ రావు, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి అమ్మవారి దర్శించుకొని ప్రజలు అందరు సుఖసంతోషాలతో ఉండాలి అని కోరారు ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపాలిటీ కొలన్ రాజశేఖర్ రెడ్డి,సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మహిళ నాయకులు, మైనారిటీ నాయకులు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అన్నపూర్ణ స్వచ్ఛంధ సేవ సంస్థ ఆధ్వర్యంలో
## 49వ రోజు అన్నదాన కార్యక్రమం



**వేములవాడ, ఆగస్టు 11, (తెలంగాణ కిరణం విలేకరి):** దక్షణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయ ఆవరణలో నిత్యం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో భాగంగా ఆదివారం 49వ రోజు మహక్షారా గారి జన్మదినాన్ని పురస్కరించుకుని వారి కుటుంబ సభ్యులు అందించిన మరియు గజ్జల హర్షిత గారి కుటుంబ సభ్యులు అందించిన సహకారంతో మరియు సంవత్సర దాతలు తోట లక్ష్మి, పబ్బ విశాల పూర్ణిమ, కూరగాయల శన్వాయ్ మౌర్య, గార్ల, మరియు శాశ్వత దాతలు నగుబోతు రవీందర్ జ్యోతి (భాను ఏజెన్సీస్) వారి సహాయం తో ఆదివారం రోజు వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ పార్కింగ్ స్థలంలో 80మంది అన్నర్థులకు పేదలకు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ట్రస్ట్ సభ్యులు చితపంటి బాలకిషన్ అన్నారు, అనంతరం వారు మాట్లాడుతూ నిత్యం నిర్వహించే అన్నదాన కార్యక్రమాన్ని ఇంకా అభివృద్ధి చేయుటకు గాను ఇతర సేవ కార్యక్రమాలకు గాను మీ వంతు సహాయ సహకారాలు అందించాలనుకునేవారు ట్రస్టు నెంబర్ 8919376459,ను సంప్రదించాల్సి%శీ%దిగా కోరారు, ఇట్టి సేవ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు చింతపంటి బాలకిషన్, తోట రాము, తోట రాజేష్, బల్గురి అఖిల్, తదితరులు పాల్గొన్నారు

## యువతకు ఇచ్చే స్కిల్ డెవలప్ శిక్షణను
# వినియోగించుకోవాలి

**- బంద్రు శోభారాణి**



**యాదాద్రి భువనగిరి, ఆగస్టు 11, (తెలంగాణ కిరణం విలేకరి):** యువతకు స్కిల్ డెవలప్ మెంట్ లో శిక్షణ ఇస్తామని దానిని వినియోగించు కోవాలని తెలంగాణ రాష్ట్ర ఉమెన్స్ కో ఆపరే టీవ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బంద్రు శోభారాణి అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా నియోజక వర్గం కేంద్రమైన ఆలేరు పట్టణంలోని పాల శీతలీకరణ కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. యువతలో ఉన్న నైపుణాలను అభివృద్ధి చేయడం ద్వారా యువత మంచి అవకాశాలు అందిపుచ్చుకుని భవిషత్ లో బంగారు బాటలు వేసుకోవడానికి అవకాశాలు ఉంటాయని అన్నారు. ఉమెన్స్ కో ఆపరే - టీవ్ కార్పొరేషన్ ద్వారా ఆలేరు నియోజకవర్గంలో శిక్షణ కార్యక్రమాలను త్వరలోనే ఏర్పాటు చేస్తా మన్నారు. ఆగస్టు 12వ తేదీన స్కిల్ డెవలప్మెంట్ ద్వారా మొదటి ప్రాధాన్యతగా మహిళలకు ఎలక్ట్రా నిక్ ఆటోలు సమకూర్చి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఆలేరు ప్రాంతంలో చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటు, ఆలేరును రెవెన్యూ డివిజన్ గా ఏర్పాటు చేసే విషయాన్ని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రెవిన్యూ డివిజన్ ఏర్పాటుకు తన వంతుగా కృషి చేస్తా నని ఆలేరు అభివృద్ధి కి పాటుపడుతానని అన్నారు.ఈ కార్యక్రమంలో మల్ రెడ్డి సాంబిరెడ్డి, ఎండీ సలీం,రాచర్ల నర్సింహులు,పాము అనిత, ఆరె రాములు, బుగ్గ నవీన్, సురేందర్ రెడ్డి, దీప, లత, చింతకింది రేణుక వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన స్థల పట్టాలను
## లాక్కున్నది "టీఆర్ఎస్ ప్రభుత్వం"



**వేములవాడ, ఆగస్టు 11, (తెలంగాణ కిరణం విలేకరి):** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ బ్రిడ్జి పక్కనున్న అమరవీరుల స్థూపం వద్ద సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జ్ కడారి రాములు గత బిఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాల పరిపాలన కాలంలో దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని వారికి రెండెకరాల కొనిస్తామని టిఆర్ఎస్ పార్టీ చెప్పడం జరిగినది, కానీ దళితుల యొక్క స్థలాలను 1970లో రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చినటువంటి పట్టాలను టిఆర్ఎస్ ప్రభుత్వం లాక్కోవడం జరిగిందని, దాన్ని వెంటనే ఎస్సీ ఎస్టీ తదితర కులాలకు ఇచ్చిన స్థలాలను వెంటనే వారి వారికి ఇవ్వాలని కోడ్స్ చేస్తున్న రైతులకు కేసులు ఎత్తివేసి ఆ పోడు జాగాలకు వేములవాడలో బ్లాక్ లిస్టులో పెట్టిన స్థలాలను ఎస్సీ మైనార్టీ కులాలకు చెందినటువంటి వాళ్లకు లిస్ట్ తీసి రైతులకు స్థలాలు కేటాయించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరడం జరిగింది లేని వీడలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కడారి రాములు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వేములవాడ సిపిఐ నాయకులు ఎల్ల దేవరాజ్, రూరల్ మండలం కార్యదర్శి శీలం రా నరసయ్య కోరపు క్రాంతి కోరపు శ్రీను, దప్పు శీను బొంబాయి లక్ష్మణ్ గాజుల దేవయ్య సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విప్‌ను కలిసిన
# మై విలేజ్ షో టీం



వేములవాడ, ఆగస్టు 11, (తెలంగాణ కిరణం విలేకరి): ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో ఆదివారం రోజున మై విలేజ్ షో టీం సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ను ఘనంగా సన్మానించారు.

## రాజన్న ఆలయ నిత్యాన్నదాన సత్రంను
## ఆకస్మిక తనిఖీ చేసిన ఈఓ కె.వినోద్ రెడ్డి



వేములవాడ, ఆగస్టు 11, (తెలంగాణ కిరణం విలేకరి): దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని నిత్యం వేలాదిగా భక్తులు దర్శించుకుంటారు. ఈ సందర్భంగా రాజన్న భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన రాజన్న అన్నదాన సత్రంను ఈఓ వినోద్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేసి భక్తులకు పెట్టె వంటకాలను పరిశీలించారు. అనంతరం భక్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు రుచికరమైన, శుచికరమైన భోజన ప్రసాదాన్ని అందించాలని నిత్యాన్నదాన సత్రం ఇంచార్జ్ ను ఆదేశించారు. వీరివెంట ఆలయ ఉద్యోగులు ఎన్. రాజేందర్, శ్రీనివాస్ లు ఉన్నారు.

## గచ్చిబౌలి హాకీ స్టేడియంలో
# హాకీ గెలుపు సంబురాలు



గచ్చిబౌలి, ఆగస్ట్ 11, (తెలంగాణ కిరణం ప్రతినిధి): ఓలంపిక్ లో హాకీ ఇండియా జట్టు కాంస్య పథకం సాదించడం తో హాకీ క్రీడాకారుల్లో రెట్టింపు ఉత్సాహం నింపిందని తెలంగాణ హాకీ రాష్ట్ర ఆద్యక్షుడు కొండ విజయ్ కుమార్ తెలిపారు. శనివారం గచ్చిబౌలి హాకీ స్టేడియంలో జూనియర్ జాతీయ టీం ఏంపిక శిబిరం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా శిబిరంకు ఏంపికైన టీంతో పాటు తెలంగాణ హాకీ క్రీడాకారులు హాకీ మాంత్రికుడు ద్యాన్ చంద్ విగ్రహంకు పూలమాలలు వేసి నివాలులు అర్పించి, హాకీ ఇండియా జట్టు సభ్యుల ఫోటోలకు పాలాబిషేకం చేపట్టారు. పంజాబ్ జలందర్ లో వచ్చె నెల సెప్టెంబర్ 9 వ తేది నుండి 18 వ తేది వరకు హాకీ జాతీయ పోటీలు కొనసాగనున్నట్లు కార్యదర్శి భీంసింగ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హాకీ తెలంగాణ సంఘం సభ్యులు సురేందర్ సింగ్, హైద్రాబాద్ ట్రెజరర్ వేణు గోపాల్, సెలక్షన్ కమిటీ సభ్యుడు హుస్సేన్ బీన్ మహ్మద్, సింగదాసరి రాజశేఖర్ గచ్చిబౌలి సాయి కోచ్ పెంచాల్, తెలంగాణ హాకీ క్రీడాకారులు పాల్గొన్నారు.

# జూరాలకు తగ్గిన వరద



గద్వాల, ఆగస్టు 11, (తెలంగాణ కిరణం): జూరాల ప్రాజెక్ట్‌కు వరద ప్రవాహం క్రమంగా తగ్గుతున్నది. ఎగువన వర్షాలు లేకపోవడంతో కర్ణాటక జలాశయాల నుంచి ప్రాజెక్టులోకి వచ్చే నీరు పూర్తి తగ్గుముఖం పట్టింది. ఆదివారం సాయంత్రానికి జూరాల జలాశయంలోకి ప్రస్తుతం 86,000 క్యూసెక్కుల నీరు వస్తున్నది. దీంతో అధికారులు ఆరు గేట్లు ఎత్తి 43,458 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318.516 మీటర్లకుగాను 318.470 మీటర్ల వద్ద నీరు ఉన్నది. జూరాల గరిష్ఠ నీటి నిల్వ 9.657 టీఎంసీలు. ప్రస్తుతం 9.652 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది.జూరాల ప్రాజెక్టుపై ఆధారపడిన నెట్టెంపాడు, బీమా ఎత్తిపోతల పథకాలతో పాటు కుడి, ఎడమ,సమాంతర కాలువకు సాగు నీటిని యథావిధిగా విడుదల చేస్తున్నారు.

# పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలి

## - తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం అధ్యక్షులు కమర్తపు మురళి



**యాదాద్రి భువనగిరి, ఆగస్టు 11(తెలంగాణ కిరణం ప్రతినిధి ):** పద్మశాలీలు స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని, రాజకీయంగా ఎదగాలంటే పద్మశాలీలు వివిధ రంగాల్లో రాణించాలని, పద్మశాలీలు రాజకీయంగా ఎదగక పోతే, భవిష్యత్తులో ఉనికి కూలిపోవడం తథ్యంమని, త్వరలో ఎల్బీనగర్ స్టేడియంలో సీఎం తో సభ పెట్టి త్రిఫ్ట 92 కోట్లు విడుదల చేస్తామని, నాలుగు జిల్లాలలో గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేస్తామని, ప్రపద్మశాలీలు రాజకీయంగా ఎదిగినప్పుడే, అభ్యున్నతి సాధ్యమని తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం అధ్యక్షులు కమర్తపు మురళి అన్నారు. ఆదివారం 33 జిల్లాల పర్యటనలో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గంలోని యాదగిరిగుట్ట పట్టణంలో ఉన్న శుభం గార్డెన్స్ ఫంక్షన్ హల్ లో ఏర్పాటుచేసిన యాదాద్రి భువనగిరి జిల్లా పద్మశాలీల సమావేశంలో జ్యోతి ప్రజ్వలన చేసి, ముఖ్యఅతిథిగా పాల్గొని మురళి మాట్లాడారు. పులి వేటాడి తిన్నట్టుగా, పద్మశాలీలు ఏ కేసులు లేకుండా పులిలాగా బోన్ లోనే ఉంటే రాజకీయ మనుగడ ప్రశ్నార్థకమని అన్నారు. పంజాబ్ రాష్ట్రంలో దేశం కోసం ప్రతి ఇంటి నుండి సైనికుడి గా ఉద్భవించినట్టుగా , ప్రతి పద్మశాలి కుటుంబం నుండి రాజకీయ నాయకుడిగా ఎదగాలని పిలుపునిచ్చారు. రాజకీయంగా ఎదగాలంటే పద్మశాలీలు కాంట్రాక్టర్ గా,కన్స్ట్రక్షన్స్ లో, రియల్ ఎస్టేట్ వ్యాపార రంగాల్లో రాణించాలని అన్నారు. ఈరోజు ఖమ్మం జిల్లాలో కార్పొరేటర్ స్థాయిలో ఉన్నాను, కాబట్టి ఏ పని అయినా ఏసీపీ,డిసిపి,ఎమ్మార్వో, కలెక్టర్ ఆఫీసుల్లో ఒక ఫోన్ చేస్తే పని అవుతుందని తెలిపారు. పోరాటాలతోనే నేతన్న హక్కులను సాధించవచ్చు అని తెలిపారు. నేత వృత్తిలో బట్ట,పొట్ట తప్ప ఆర్థిక మనుగడ శూన్యమని తెలిపారు.గతంలో ఉన్న చేనేత కమీషనర్ ద్వారా పోరాటం చేసి 25 కోట్లు విడుదల చేయడం జరిగిందని, ఈ ప్రభుత్వ హయాంలో శైలజ అయ్యర్ ను కమిషనర్ గా నియమించి 13 కోట్లు విడుదల చేయడం జరిగిందని తెలిపారు.జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకొని హైదరాబాదులో పీపుల్స్ పాజాలో చేనేత బీమా కోసం 6 కోట్లు విడుదల చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల కోసం 33 వేల కోట్ల రూపాయలను విడుదల చేసి రుణమాఫీ చేయడం జరిగిందని గుర్తు చేశారు.అదే మాదిరిగా చేనేత రుణమాఫీ కోసం 65 కోట్లు విడుదల చేయాలని ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చి మాఫీ చేస్తామని తెలిపారు. పోచంపల్లిలో ఐ ఐ హెచ్ పి కాలేజీ ని పద్మశాలి పిల్లల కోసం నిర్మిస్తామని తెలిపారు.ప్రభుత్వంతో మాట్లాడి మహబూబ్ నగర్,ఉమ్మడి నల్గొండజిల్లా, వరంగల్, ఖమ్మం జిల్లాలో చేనేత పిల్లల కోసం గురుకుల పాఠశాలలను నిర్మిస్తామని తెలిపారు. యారన్ సబ్సిడీ, చేనేత మిత్ర మొదలగు పథకాలను సీఎం రేవంత్ రెడ్డి తో ఎల్బీనగర్ స్టేడియంలో 30 వేల పద్మశాలి కుటుంబంకులతో సమావేశం ఏర్పాటు చేసి అమలు చేస్తామని హామీ ఇచ్చారు. పద్మశాలీల అభ్యున్నతి కోసం రాష్ట్ర అధ్యక్షుడిగా తన కర్తవ్యాన్ని నిర్వహిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా యాదాద్రి జిల్లా అధ్యక్షులు మరియు తెలంగాణ ప్రాంత తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిక్క వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గతంలో చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించినట్టుగానే నిర్వహించాలని మురళి ని కోరారు. సంఘాల ఎన్నికలు నిర్వహించక ముందే అర్హులైన నేతన్నలకు సభ్యత్వాలు ఇప్పించిన తర్వాత సంఘాల ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. యాదాద్రి జిల్లాలో పద్మశాలీల అభ్యున్నతి కోసం కృషి చేస్తానని తెలిపారు. అంతకుముందు తెలంగాణ రాష్ట్ర కమిటీ లో వర్కింగ్ ప్రెసిడెంట్ గా నూతనంగా ఎన్నికైన యాదాద్రి జిల్లా చిక్క వెంకటేశ్వర్లకు శాలువాతో సత్కరించి, నియామక పత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్ర కమిటీ లో ఎన్నికైన వారిలో చిక్క వెంకటేశ్వర్లు యాదాద్రి భువనగిరి జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు, తెలంగాణ ప్రాంత రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్,తడక రమేష్ తెలంగాణ ప్రాంత రాష్ట్ర ఉపాధ్యక్షులు, అంకం మురళి తెలంగాణ ప్రాంత రాష్ట్ర చేనేత విభాగం ఉపాధ్యక్షులు,ఏలూరు కృష్ణ తెలంగాణ ప్రాంత రాష్ట్ర వైద్య విభాగం ఉపాధ్యక్షులు చిన్నం ప్రకాష్ తెలంగాణ ప్రాంత రాజకీయ విభాగం ఉపాధ్యక్షులు,గుండు ప్రసాద్ తెలంగాణ ప్రాంత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ,పోచం బిక్షపతి తెలంగాణ ప్రాంత కార్యవర్గ సభ్యులు, బింగి వైకుంఠం తెలంగాణ ప్రాంత రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, బొద్దుల నగేష్ తెలంగాణ ప్రాంత రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షులు తదితరులను రాష్ట్ర అధ్యక్షులు కమర్తపు మురళి శాలువాతో సత్కరించి,నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు గుంటక రూపా,పుష్పలత, గౌరవ అధ్యక్షులు మెతుకు సత్యం, ప్రధాన కార్యదర్శి మాచర్ల రామచంద్రావు, కోశాధికారి బొమ్మ రఘురాం, యువజన విభాగం అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, పోచంపల్లి కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తడక రమేష్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు కత్తుల సుదర్శన్, యాదగిరిగుట్ట మాజీ పట్టణ అధ్యక్షులు కాటాబత్తిని ఆంజనేయులు, యాదగిరిగుట్ట పట్టణ అధ్యక్షులు గుంటా వెంకటేష్, వివిధ మండలాల నుండి వచ్చిన పద్మశాలి నాయకులు, కుల బాంధవులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ డిస్ట్రిక్ట్ టైక్వాండో ఛాంపియన్షిప్ 2024

## - 40వ తెలంగాణ స్టేట్ సీనియర్ కొరిగి,13వ తెలంగాణ స్టేట్ సీనియర్ పోమ్ స్, 41వ తెలంగాణ స్టేట్ జూనియర్ కొరిగి,14వ తెలంగాణ స్టేట్ జూనియర్ పోమ్స్




జోగులాంబ గద్వాల, ఆగస్టు 11, (తెలంగాణ కిరణం): కేంద్రంలోని వాల్మీకి భవన్లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి అన్ని జిల్లాల నుండి 260 మంది క్రీడాకారులు పాల్గొనడం జరిగింది ఇందులో పాల్గొని విజయం సాధించిన జూనియర్స్ కేటగిరీలోని క్రీడాకారులు సెప్టెంబర్ 8,9,10 ఆగ్రా లో జరిగే జాతీయస్థాయి పోటీలలో తెలంగాణ రాష్ట్రం నుంచి పాల్గొననున్నారు. సీనియర్ కేటగిరీలోని క్రీడాకారులు తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ అక్టోబర్ 27,28,29 తారీకు లో జరిగే జాతి స్థాయి పోటీలలో పాల్గొననున్నారు. ఈ ఎంపికలను జోగులాంబ గద్వాల జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ స్టేట్ టైక్వాండో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మాస్టర్ కె శ్రీహరి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది ఇందులో గెలుపొందిన క్రీడాకారులకు ముఖ్య అతిథులుగా వచ్చినటువంటి డివైఎస్ఓ బిఎస్ ఆనంద్, జోగులమ్మ గద్వాల జిల్లా స్కూల్ గేమ్ సెక్రెటరీ జితేందర్ , పి టి అసోసియేషన్ ప్రెసిడెంట్ కృష్ణ చేతుల మీదుగా క్రీడాకారులకు మెడల్స్ ని అందజేశారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభను చాటి జాతీయస్థాయికి ఎంపికైన క్రీడాకారిణి క్రీడాకారు లను అభినందించి జాతీయస్థాయిలో మన తెలంగాణ రాష్ట్రానికి పేరు వచ్చే విధంగా కృషి చేయాలని జాతీయ స్థాయిలో కూడా తెలంగాణ రాష్ట్ర పేరును నిలబెట్టాలని తెలంగాణ స్టేట్ టైక్వాండో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మాస్టర్ %ఎ%.శ్రీహరి, ప్రెసిడెంట్ ముట్ట శ్రీనివాస్ క్రీడాకారులకు తెలియజేశారు. ఈ క్రీడలలో పాల్గొన్న తెలంగాణ జిల్లాల సెక్రటరీ, ప్రెసిడెంట్ మరియు కోచులకు అభినందనలు తెలియజేశారు.

# సాహిత్యం, కలలు సమాజ చైతన్యానికి దోహద పడతాయి

## - ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆశన్న



జోగులాంబ గద్వాల, ఆగస్టు11, (తెలంగాణ కిరణం): సమాజ చైతన్యానికి సాహిత్యం కలలు ఎంతో ఉపయోగపడతాయని ప్రజానాట్యమండలి జిల్లా గౌరవ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి,కార్యదర్శి ఆశన్న తెలిపారు. ప్రజానాట్యమండలి జిల్లా కమిటీ సమావేశం జిల్లా కేంద్రంలోని శ్రీ చైతన్య స్కూల్లో ఆదివారం నిర్వహించారు. విద్య, విజ్ఞానం, మూఢనమ్మకాలు, సామాజిక చైతన్యం తదితరా అంశాలపై జిల్లా ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత కవులు,కళాకారులపై ఉందని గుర్తు చేశారు. విద్య విజ్ఞానం పట్ల ప్రతి విద్యార్థికి, తల్లిదండ్రులకు అవగాహన పెంచేందుకు ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలను చేపట్టనున్నట్లు వారు తెలిపారు. ఆనాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాలను కళారూపాల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు రాష్ట్రవ్యాప్తంగా శౌర్య యాత్ర పేరుతో రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో కళాజాతను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థికి సామాజిక చైతన్యం రావాలంటే విజ్ఞానం, వినోదం, వికాసం ఎంతో అవసరమని అన్నారు. విద్యార్థినీ విద్యార్థులకు సాహిత్యం కళలపైన అవగాహన పెంచేందుకు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కళా రంగంలో సేవలు అందిస్తూ చనిపోయిన కళాకారులకు విపత్తులో ప్రాణాలు కోల్పోయిన ప్రజల జిల్లా కమిటీ తరఫున నివాళులు అర్పించారు. సమావేశంలో ప్రజానాట్యమండలి జిల్లా ఉపాధ్యక్షులు వి నరసింహ, సహాయ కార్యదర్శి లక్ష్మి, జిల్లా నాయకులు అభిషేక్, తిమ్మప్ప, సురేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతాల్లో యువతకు పోలీస్ శాఖ తరపున వాలీబాల్ పోటీలు







**మహబూబాబాద్, ఆగస్టు 11, (తెలంగాణ కిరణం ప్రతినిధి):** మహబూబాబాద్ జిల్లా గూడూరు కొత్తగూడ, గంగారం పోలీస్ స్టేషన్ పరిధిలో మహబూబాబాద్ జిల్లా పోలీస్ శాఖ తరపున మండల స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ క్రీడాల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిధిగా మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఐపీఎస్ విచ్చేసి కొత్తగూడ ఏకలవ్య మోడల్ స్కూల్ లొ క్రీడా ప్రాంగ ణంలో ఏర్పాటు చేసిన స్టేజి పై జ్యోతిప్రజ్వలన చేసారు. అనంతరం ఏకలవ్య స్కూల్ విద్యార్థినిలా నృత్యప్ర దర్శన తిలకించారు అనం తరం వాలీబాల్ టీం సభ్యులను పరిచయం చేసుకొని గూడూరు కొత్తగూడ గంగారం మండలలో క్రీడోత్సవంలో పాల్గొని టాస్ వేసి ఆటను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూగ్రామీణ ప్రాంతాల్లో యువత క్రీడా స్ఫూర్తి పెంపోందిం చుకోవాలని అన్నారు మహబూబాబాద్ జిల్లా పోలీస్ శాఖ తరపున యువతకు క్రికెట్ వాలీబాల్ కిట్లను పంపిణి చేశామ న్నారు యువత గంజాయి లాంటి మత్తుపదార్థాలా బారిన పడి భవిష్యత్తు నాశనం చేసుకోవద్దు అన్నారు త్వరలోనే నిరుద్యోగ యువత కోసం జాబ్ మేళా నిర్వహించ నున్నామని అర్హత కలిగిన యువతి యువకులు పాల్గొ నవచ్చు అని అన్నారు. మహబూబాబాద్ జిల్లా పోలీస్ శాఖ తరపున డ్రాయింగ్ కాంపిటీషన్ చిత్రాలేకణం నిర్వహిం చడం జరుగుతుంది, ఈ పోటీలొ పాల్గొని తెలిపిన అంశాల పై స్కూల్ విద్యార్థులు చిత్రాలు వేసి దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్ లొ సమర్పించాలని అన్నారు స్కూల్ విద్యా ర్థులు సైబర్ క్రైమ్, షీ టీమ్స్, నూతన చట్టలపై అవగాహనా కలిగి ఉండాలన్నారు ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో తెలియజేశారు.

# కుంగ్ - ఫూ కరాటే యుద్ధ విద్యల బెల్ట్ పరీక్ష

## - యుద్ధ విద్య విద్యార్థిని విద్యార్థులకు ఎంతో అవసరం



జోగులమ్మ గద్వాల, ఆగస్టు 11, (తెలంగాణ కిరణం): ఎర్రవల్లి మండల కేంద్రంలో కుంగ్ - ఫూ యుద్ధ విద్యల బెల్ట్ పరీక్ష నిర్వహించడం జరిగిందని మాస్టర్లు విజయ్, రాజులు ఒక ప్రకటన తెలిపారు. గత రెండు సంవత్సరాలుగా కుంగ్ - ఫూ కరాటే యుద్ధ విద్యను ఎర్రవల్లి మండల కేంద్రము తో పాటు చుట్టూ గ్రామాలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు నేర్చుకోవడం జరుగుతుందని, ఈరోజు వారికి బెల్టు పరీక్ష నిర్వహించడం జరిగిందని వివరించారు, అనంతరం వారు మాట్లాడుతూ శరీర దారుఢ్యం, ఆరోగ్యానికి, ఆత్మరక్షణకు, కుంగ్ - ఫూ కరాటే ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు, ప్రతి ఒక్కరూ యుద్ధ విద్యలు నేర్చుకోవాలని తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని స్వీయ రక్షణ తో పాటు సమాజానికి ఉపయోగపడేలా ఉండాలని వారు కోరారు . విద్యార్థినీ విద్యార్థులు కుంగ్ - ఫూ కటాస్ స్పారింగ్, జిమ్నాస్టిక్ వెపన్ కటాస్ తదితర యుద్ధ విద్యను ప్రదర్శించడం జరిగిందని తెలిపారు, అనంతరం విద్యార్థినీ విద్యార్థులకు బెల్టులు సర్టిఫికెట్లు అందజేయడం జరిగిందని



పేర్కొన్నారు, ఈ కార్యక్రమంలో పరిపూర్ణాచారి, మన్నెం, నరసింహులు, శేషు, తదితరులు పాల్గొన్నారు

# బాల్య మిత్రుడైనందు వల్లే ఐపీఈ ప్లస్ ఫండ్‌లో ధావల్ బుచి పెట్టుబడులు..!




గౌతం అదానీ సారధ్యంలోని అదానీ గ్రూప్ అనుబంధ విదేశీ సంస్థల్లో తమ కుటుంబ పెట్టుబడులపై సెబీ చైర్ పర్సన్ మాధాబి పూరీ బుచ్ పెదవి విప్పారు. పాఠశాల నుంచి ఐఐటీ ఢిల్లీలో విద్యాభ్యాసం వరకూ బాల్య స్నేహితుడైన అనిల్ అహుజా.. ఐపీఈ-ప్లస్ ఫండ్ చీఫ్ ఇన్వెస్ట్ మెంట్ ఆఫీసర్‌గా ఉన్నందున తన భర్త ధావల్ బుచి ఆ సంస్థలో పెట్టుబడులు పెట్టారని పేర్కొన్నారు.హిండెన్ బర్గ్ తన ప్రజా వేగు ఇచ్చిన విచారణ నివేదిక ఆధారంగా చేసిన ఆరోపణలపై మాధాబీ పురీ బుచ్ 15-పాయింట్ల క్లారిఫికేషన్ ఇచ్చారు. దశాబ్దాల పాటు స్ట్రాంగ్ ఇన్వెస్టింగ్ కెరీర్‌లో కొనసాగిన తన భర్త సిటీ బ్యాంక్, జేపీ మోర్గా, 3ఐ గ్రూప్ పీఎల్‌సీ ల్లో మాజీ ఉద్యోగిగా అనిల్ అహుజా ఉన్నందునే అదానీ గ్రూప్ అనుబంధ సంస్థల్లో తన భర్త పెట్టుబడులు పెట్టారని పేర్కొన్నారు. 2018లో ఐపీఈ-ప్లస్ ఫండ్‌లో పెట్టుబడులు పెట్టాలని నిర్ణయించామని, ఈ ఫండ్ సీఐఓగా అనిల్ అహుజా వైదొలగగానే తమ పెట్టుబడులు ఉపసంహరించుకున్నట్లు బుచ్ ఫ్యామిలీ ఓ ప్రకటనలో వివరణ ఇచ్చింది. సింగపూర్‌లో తాము సాధారణ పౌరులుగా జీవిస్తున్నప్పుడు 2015లో ఐపీఈ-ప్లస్ ఫండ్‌లో పెట్టుబడులు పెట్టామని సెబీ చీఫ్ మాదాబి పురీ బుచ్ తెలిపారు. సెబీలో పూర్తికాల సభ్యురాలిగా చేరడానికి రెండేండ్ల ముందు ఈ పెట్టుబడులు పెట్టినట్లు వివరణ ఇచ్చారు. బ్లాక్ స్టోన్ మద్దతుతో పని చేస్తున్న మైండ్ స్పేస్, నెక్సస్ సెలెక్ట్ ట్రస్ట్ లకు చెందిన ఆర్ఈఐటీ ఐపీఓకు సెబీ ఆమోదం లభించడాన్ని హిండెన్ బర్గ్ రీసెర్చ్ ప్రశ్నించింది. అదే సమయంలో బ్లాక్ స్టోన్ సంస్థలో సీనియర్ అడ్వైజర్‌గా ధావల్ బుచి నియామకానికి ఆమోదం లభించిందని గుర్తు చేసింది. సెబీ చైర్ పర్సన్ గా నియామకం కావడానికి ముందే బ్లాక్ స్టోన్ ప్రైవేట్ ఈక్విటీ సంస్థ సీనియర్ అడ్వైజర్ గా ధావల్ బుచి నియమితులయ్యారని మాధాబీ పురి బుచ్ ఓ ప్రకటనలో తెలిపింది. బ్లాక్ స్టోన్ అనుబంధ రియల్ ఎస్టేట్ సంస్థలతో ధావల్ బుచి అనుబంధం కలిగి ఉండే అవకాశమే లేదని పేర్కొంది.

# ఎన్టిపిసిలో ఘనంగా ముగిసిన "జాతీయస్థాయి కళోత్సవాలు"

## - ఎన్టిపిసి మిలీనియం హాలులో రెండు రోజులపాటు జరిగిన నల్ల వజ్రం పురస్కారాలు




**(గోదావరిఖని) ఆగస్టు 11 తెలంగాణ కిరణం విలేకరి:** అంతర్జాతీయంగా ఖ్యాతిగాంచిన తారా ఆర్ట్స్ అకాడమీ ఎన్టిపిసిలో జాతీయస్థాయి కళోత్సవాలు నిర్వహించడం అభినందనీయమని పలువురు అతిథులు ప్రశంసించారు. స్థానిక ఎన్టిపిసిలోని ఈడిసీ ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన జాతీయస్థాయి కళోత్సవాలు, 'నల్లవజ్రం' పురస్కారాల రెండవ రోజు కార్యక్రమాలకు హాజరైన అతిథులు మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా ప్రతిభ కలిగిన కళాకారులు, క్రీడాకారులు వివిధ రంగాల వారిని గుర్తించి, 'నల్లవజ్రం' పురస్కారాలు అందజేయడం అభినందనీయమన్నారు. ఈ పురస్కారాలు వారికి మరింత ప్రోత్సాహం ఇస్తాయన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఎసిపి ప్రతాప్, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సంకె రాజేష్, మేకల శ్రీధర్ యాదవ్, టీవీ నటీ, నటులు గోపాల స్వామి, ప్రణయ్ కుమార్, లోహిత్ కుమార్, లిరీష, చరిష్మా, సోహెల్, నిర్వహణ కమిటీ సభ్యులు కే.స్వామి, మేజిక్ రాజా, దయా నర్సింగ్, దామెర శంకర్, చల్లా ప్రవీణ్, నర్సయ్య, తిరుమల్, చీకటి అంజయ్య,



సుంకే రాజు, డాక్టర్ సాయి తదితరులు పాల్గొన్నారు. అనంతరం రాజమండ్రి, హైదరాబాద్, కరీంనగర్, స్థానిక కళాకారులు ప్రదర్శించిన పేరిణి కూచిపూడి నృత్యాలు, గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

# జయహో ఛత్రపతి శివాజీ మహారాజ్

## - ఔరంగజేబ్ బంధించినపుడు 'ఆగ్రా జైలు' నుంచి శివాజీ ఎలా తప్పించుకున్నారు.?



ఛత్రపతి శివాజీని ఎలాగైనా ఔరంగజేబ్ దర్బారుకు పంపించాలని దక్షిణాన ఔరంగజేబ్ వైస్రాయ్ మీర్జా రాజాసింగ్ కంకణం కట్టుకున్నాడు. కానీ ఆయన్ను అక్కడికి పంపడం అంత సులభం కాదు. పురందర్ ఒప్పందంలో మొఘల్ మన్సబ్ కోసం పనిచేయడానికి, రాజ దర్బారుకు వెళ్లడానికి ఒప్పుకునేది లేదని శివాజీ స్పష్టంగా చెప్పారు. దానికి కొన్ని ప్రత్యేక కారణాలు కూడా ఉన్నాయి. ఔరంగజేబ్ మాటలపై శివాజీకి ఏమాత్రం నమ్మకం లేదు. తన మాట నెగ్గించుకోడానికి ఔరంగజేబ్ ఎంతకైనా తెగిస్తాడని శివాజీ అనుకునేవారు. ప్రముఖ చరిత్రకారుడు జదునాథ్ సర్కార్ తన 'శివాజీ అండ్ హిజ్ టైమ్స్' పుస్తకంలో ఆ ఘటన గురించి రాశారు. "మీరు ఔరంగజేబ్‌ను కలిస్తే ఆయన తర్వాత మిమ్మల్ని దక్కనుకు వైస్రాయ్‌గా చేస్తారేమో. బీజాపూర్, గోల్కొండను ఆక్రమించుకోడానికి తన నాయకత్వంలో ఒక దళాన్ని పంపిస్తారేమో' అని శివాజీని కలిసిన జయ్ సింగ్ ఆయనలో ఆశలు రేపారు. అయితే ఔరంగజేబ్ అలాంటి హామీలు ఏవీ ఇవ్వలేదు" అని చెప్పారు.

### ఆగ్రా బయల్దేరిన శివాజీ

ఔరంగజేబ్‌ను కలిస్తే బీజాపూర్ నుంచి పన్ను వసూలు చేసుకోవడానికి ఆయన తనకు అనుమతి ఇస్తారేమోనని శివాజీ మనసులో అనుకున్నారు. మరాఠా దర్బార్‌లో అదే విషయం మీద చర్చ జరిగినపుడు ఔరంగజేబ్‌ను కలవడానికి శివాజీ ఆగ్రా వెళ్తే బాగుంటుందనే అందరూ నిర్ణయానికి వచ్చారు. దాంతో 1666 మార్చి 5న తల్లి జిజియాబాయికి రాజ్యం బాధ్యతలు అప్పజెప్పి, ఔరంగజేబ్‌ను కలవడానికి ఆగ్రా బయల్దేరారు శివాజీ. శివాజీ భద్రత చూసుకునే బాధ్యతను జయ్ సింగ్ ఆగ్రాలో ఉన్న తన కొడుకు కుమార్ రాం సింగ్‌కు అప్పగించారు. ఆగ్రా రావడానికి ఖర్చుల కోసం శివాజీకి ఔరంగజేబ్ లక్ష రూపాయలు ముందే చెల్లించే ఏర్పాట్లు కూడా చేశారు. ఆ దారిలో ఉండగానే శివాజీకి ఔరంగజేబు నుంచి ఒక లేఖ అందింది. ప్రముఖ చరిత్రకారుడు ఎస్ఎం పగాడీ తన 'ఛత్రపతి శివాజీ' పుస్తకంలో ఆ లేఖలోని వివరాల గురించి రాశారు. "మీరు ఇక్కడకు ఎలాంటి సంకోచం లేకుండా రండి. మీ మనసులో ఎలాంటి ఆందోళన ఉంచుకోకండి. నన్ను కలిశాక మీకు రాచ మర్యాదలు జరుగుతాయి. మిమ్మల్ని తిరిగి గౌరవంగా ఇంటికి వెళ్లనిస్తాం. మీరు వేసుకోడానికి నేను ఖిలాత్ అంటే ఖరీదైన దుస్తులను కూడా పంపుతున్నాను" అని ఆ లేఖలో ఉంది.

### శివాజీకి అవమానం



1666 మే 9న శివాజీ ఆగ్రా శివారు ప్రాంతానికి చేరుకున్నారు. అప్పట్లో ఔరంగజేబ్ దర్బార్ అక్కడే ఉండేది. మే 12న ఆయన ఔరంగజేబ్‌ను కలవాలని చెప్పారు. దర్బారులో 'శివాజీ రాజా' అని గట్టిగా పేరు పిలవగానే, శివాజీ, ఆయన కొడుకు శంభాజీ, పది మంది అనుచరులను ఔరంగజేబ్ సభలోకి తీసుకెళ్లారు కుమార్ రాం సింగ్. మరాఠా రాజ్యం తరఫున ఔరంగజేబ్‌కు 2 వేల బంగారు నాణాలు 'నజర్'గా, 6 వేల రూపాయల 'నిసార్'గా అందించారు. శివాజీ.. ఔరంగజేబ్ సింహాసనం దగ్గరికి వెళ్లి ఆయనకు మూడుసార్లు సలాం చేశారు. ఒక క్షణంపాటు సభ అంతా నిశ్శబ్దం అలుముకుంది. ఔరంగజేబ్ తల ఊపి శివాజీ బహుమతులు స్వీకరించారు. తర్వాత తన సహాయకుడి చెవిలో చక్రవర్తి ఏదో చెప్పారు. దాంతో శివాజీని మూడో హోదాలో ఉండే మన్సబుదారుల కోసం అప్పటికే ఏర్పాటు చేసిన వరుసలోకి తీసుకెళ్లారు. సభ ఎప్పటిలాగే నడుస్తోంది. కానీ, తనకు అలాంటి స్వాగతం లభిస్తుందని శివాజీ ఊహించలేదు.

### బుసలుకొట్టిన శివాజీ కోపం

ఆ సమయంలో శివాజీ ఎలా స్పందించారో జదునాథ్ సర్కార్ తన పుస్తకంలో రాశారు. ఆగ్రా బయట తనకు స్వాగతం పలకడానికి రామ్ సింగ్, ముఖ్లిస్ ఖాన్ లాంటి మామూలు అధికారులను ఔరంగజేబ్ పంపించడం శివాజీకి నచ్చలేదు. సభలో తల వంచిన తన గురించి ఒక మంచి మాట చెప్పడం గానీ, ఆయనకు ఏదైనా బహుమతులు ఇవ్వడం గానీ చేయలేదు. దానికి తోడు ఆయన్ను సాధారణ మన్సబుదారుల మధ్యలో ఎన్నో వరుసల వెనక నిలబెట్టారు. అక్కడ నుంచి ఔరంగజేబ్ కూడా సరిగా కనిపించడం లేదు. అప్పటికే శివాజీ కోపం కట్టలుతెంచుకుంది. ఆయన రామ్ సింగ్‌తో "నన్ను ఎవరి మధ్య తీసుకొచ్చి నిలబెట్టావ్" అని అడిగారు. రాం సింగ్ ఆయనతో "మీరు పాంచ్ హజారీ (5 వేల మంది సైనికులకు అధిపతి) మన్సబ్‌దారుల మధ్య ఉన్నారు" అని చెప్పారు. దాంతో శివాజీ బిగ్గరగా "నా ఏడేళ్ల కొడుకు, నా నౌకర్ నేతాజీ కూడా పాంచ్ హజారీలే. చక్రవర్తి అని గౌరవించి, అంత దూరం నుంచి ఆగ్రా వచ్చిన నన్ను వీళ్లతో పోల్చుతారా" అన్నారు. తర్వాత శివాజీ "నా ముందు ఉన్నది ఎవరు" అన్నారు. "రాజా రాయ్ సింగ్ సిసోడియా" అన్నాడు రాం సింగ్. దాంతో శివాజీ గట్టిగా "రాయ్ సింగ్%ొ% రాజా జయ్ సింగ్ చేతి కింద వాడు. మీరు నన్ను వాళ్ల వరుసలో నిలబెడతారా" అని గద్దించారు.

### ఔరంగజేబ్‌కు రాం సింగ్ వివరణ



ఔరంగజేబ్ పదేళ్ల పాలనపై 'ఆలంగీర్‌నామా' పుస్తకం రాసిన మొహమ్మద్ కాజిమ్ అందులో ఆ తర్వాత ఏం జరిగిందో రాశారు. తనకు ఘోర అవమానం జరగడంతో రగిలిపోయిన శివాజీ రాం సింగ్‌తో గట్టిగట్టిగా మాట్లాడుతున్నారు. ఆయన దర్బార్‌లో అలా మాట్లాడుతుండడంతో రాం సింగ్ కంగారు పడిపోయి శివాజీ కోపం చల్లార్చే ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ శివాజీ శాంతించలేదు. కాసేపు అక్కడ నిలుచున్న శివాజీ తర్వాత ఆ వరుస నుంచి బయటికొచ్చి ఒక మూల కూర్చున్నారు. శివాజీ గట్టిగా అరవడం విన్న ఔరంగజేబ్.. ఆ అరుపులేంటి అన్నారు. దాంతో రాం సింగ్ చాకచక్యంగా జవాబు చెప్పారు. "సింహం అడవి జంతువు, అది ఇక్కడ ఉక్కపోతను భరించలేక, జబ్బు పడింది" అన్నారు. క్షమించమని ఔరంగజేబ్‌ను కోరిన రాం సింగ్.. దక్కన్ నుంచి వచ్చిన మహానుభావ్‌కు చక్రవర్తి దర్బార్ నియమాల గురించి తెలీదని చెప్పారు. దాంతో శివాజీని పక్కనున్న గదిలోకి తీసుకెళ్లి ఆయనపై పన్నీరు చల్లాలని ఔరంగజేబ్ చెప్పారు. ఆయన కుదుటపడిన తర్వాత, దర్బారు ముగిసేవరకూ వేచిచూడకుండా శివాజీని నేరుగా ఆయన కోసం ఏర్పాటు చేసిన విడిది ప్రాంతానికి తీసుకెళ్లాలని సూచించారు.

### శివాజీ ఉన్న భవనాన్ని చుట్టుముట్టారు

ఆగ్రా నగరం నాలుగు గోడల బయట జయ్‌పూర్ సరాయ్‌లో శివాజీకి విడిది ఏర్పాటు చేయాలని రాం సింగ్‌కు ఆదేశాలు అందాయి. శివాజీ జయ్‌పూర్ నివాసంలోకి వెళ్లగానే, ఒక అశ్విక దళం ఆ ఇంటిని నాలుగు వైపుల నుంచి చుట్టుముట్టింది. కాసేపటికే మరికొందరు సైనికులు అక్కడికి చేరుకున్నారు. వాళ్లు తమ ఫిరంగులను భవనానికి ఉన్న ప్రతి తలుపు వైపూ గురిపెట్టారు. కానీ సైనికులతో రహస్యంగా నిఘా పెట్టిన కొన్ని రోజులకు ఔరంగజేబ్‌కు శివాజీని చంపాలనే ఉద్దేశం లేదనే విషయం అర్థమైంది. డెనిస్ కింకెడ్ తన 'శివాజీ ద గ్రేట్ రెబల్' పుస్తకంలో ఆ సమయంలో జరిగిన వాటి గురించి వివరించారు. అయితే శివాజీకి తను ఉన్న ఆ భవనం నుంచి బయటకు వెళ్లడానికి అనుమతి లేదు. కానీ అప్పుడు కూడా ఔరంగజేబ్ నుంచి ఆయనకు అప్పుడప్పుడూ గౌరవ సందేశాలు వస్తూనే ఉన్నాయి. చక్రవర్తి ఆయనకు పండ్ల బుట్టల కూడా పంపించేవారు. శివాజీ ఆ తర్వాత ఔరంగజేబ్ ప్రధాన వజీర్ ఉమ్‌దావుల్ ముల్క్‌కు ఒక సందేశం పంపించారు. చక్రవర్తి నన్ను సురక్షితంగా తిరిగి పంపిస్తానని హామీ ఇచ్చారు. కానీ అది జరిగేలా ఏమాత్రం కనిపించడం లేదు అన్నారు. తనను చంపించడానికి తగిన సాకు కోసం ఔరంగజేబ్ వేచిచూస్తున్నాడని, కోపంలో




ఏదైనా చేసేలా తనను మెల్లమెల్లగా రెచ్చగొట్టాలనుకుంటున్నాడని శివాజీకి అర్థమైంది.

### హఠాత్తుగా మారిన శివాజీ ప్రవర్తన

భవనంలో బందీలా ఉన్న శివాజీపై నిఘా పెట్టిన సైనికులకు ఆయన ప్రవర్తనలో హఠాత్తుగా మార్పు అనిపించింది. ఆయన చాలా సంతోషంగా ఉన్నట్టు కనిపిస్తోంది. తనకు కాపలాగా ఉన్న సైనికులతో ఆయన నవ్వుతూ సరదాగా మాట్లాడుతున్నారు. సైనికాధికారులకు ఎన్నో బహుమతులు పంపిస్తున్నారు. ఆగ్రా వాతావరణం తనకు బాగా నచ్చిందని చెబుతున్నారు. తన కోసం ఎన్నో తీపి వంటకాలు, పండ్లు పంపిస్తున్న చక్రవర్తికి చాలా రుణపడి ఉంటానని శివాజీ అనడం కూడా విన్నారు. పాలన కార్యకలాపాలకు దూరంగా ఆగ్రా లాంటి సాంస్కృతిక నగరంలో ఉండడం చాలా




హాయిగా ఉందని శివాజీ వాళ్లతో అన్నారు. ఈలోపు ఔరంగజేబ్ గూఢచారులు ఆయనపై రాత్రింబవళ్లు నిఘా పెడుతూనే ఉన్నారు. శివాజీ ప్రస్తుతం చాలా సంతృప్తిగా కనిపిస్తున్నారని వాళ్లు తమ చక్రవర్తికి ఒక సందేశం కూడా పంపించారు. ఔరంగజేబ్‌కు మరింత నమ్మకం కలిగేలా, తన తల్లి, భార్య కూడా తన దగ్గరకు వచ్చి ఉండడానికి అనుమతిస్తారా అని శివాజీ చక్రవర్తికి ఒక సందేశం కూడా పంపించారు. ఔరంగజేబ్ దానికి సరే అన్నారు. తమ ఇంటి ఆడవాళ్లను బందీలుగా చేసే వ్యక్తి, ఎప్పటికీ పారిపోయే సాహసం చేయడని ఔరంగజేబ్‌కు మనసులో అనిపించింది. కానీ, చక్రవర్తి అనుమతి లభించినా శివాజీ కుటుంబంలోని మహిళలు ఆగ్రాకు రాలేదన్నది వాస్తవం.



బహుశా, ఆ ప్రాంతంలో భారీ వర్షాల వల్ల వాళ్లు అంత సుదీర్ఘ ప్రయాణం చేయలేకపోయారని ఒక కారణంగా చెబుతారు. కొన్ని రోజుల తర్వాత తనతోపాటూ వచ్చిన మరాఠా అశ్వికులను తిరిగి తమ రాజ్యానికి పంపించాలని శివాజీ.. చక్రవర్తికి సందేశం పంపించారు. చక్రవర్తి స్వయంగా మరాఠా సైనికులను వదిలించుకోవాలని అనుకుంటున్నారు. శివాజీ స్వయంగా అలా అడిగేసరికి ఆయన సంతోషపడిపోయారు.


### అనారోగ్యం సాకుతో




తర్వాత తనకు అనారోగ్యంగా ఉందని శివాజీ సాకు చెప్పారు. బయట కాపలా ఉన్న మొఘల్ సైనికులకు ఆయన మూలుగులు కూడా వినిపిస్తున్నాయి. తన ఆరోగ్యం కుదుటపడాలని ఆయన ఇంటి బయట బ్రాహ్మణులకు, సన్యాసులకు ప్రతి సాయంత్రం బుట్టల్లో మిఠాయిలు, పళ్లు కూడా పంపించేవారు. బయట కాపలా కాస్తున్న సైనికులు కొన్ని రోజులు బయటకు వెళ్తున్న బుట్టలను తనిఖీ చేశారు. తర్వాత వాళ్లు వాటిని పట్టించుకోవడం మానేశారు. జదునాథ్ సర్కార్ తన పుస్తకం 'శివాజీ అండ్ హిజ్ టైమ్స్'లో ఆయన ఎలా తప్పించుకున్నారో వివరించారు. 1666 ఆగస్టు 19న శివాజీ బయట ఉన్న సైనికులకు తనకు చాలా అనారోగ్యంగా ఉన్నట్టు, పడుకున్నట్టు తెలిసేలా చేశారు. తన విశ్రాంతికి భంగం కలిగించవద్దని, ఎవరినీ లోపలికి పంపించవద్దని చెప్పించారు. అచ్చం తనలాగే కనిపించే తన సవతి సోదరుడు హీరాజీ ఫర్జాంద్‌కు తన బట్టలు, ముత్యాల హారం వేసి మంచంపై పడుకోబెట్టారు. శివాజీ కడియం ఉన్న ఆయన చెయ్యి మాత్రమే కనిపించేలా మిగతా శరీరం అంతా ఒక దుప్పటి కప్పేశారు. శివాజీ, ఆయన కొడుకు శంబాజీ వెదుర్ల సాయంతో భుజాలపై మోసే ఒక పళ్ల బుట్టలో కూర్చున్నారు. దానిని కూలీలు భవనం నుంచి బయటకు తీసుకొచ్చారు. కాపలా కాస్తున్న సైనికులు ఆ బుట్టలను తనిఖీ చేయాలనుకోలేదు. కూలీలు ఆ బుట్టలను నగరంలో నిర్మానుష్యంగా ఉన్న వీధుల్లోంచి తీసుకెళ్లారు. బయటకు చేరుకున్న తర్వాత కూలీలను తిరిగి పంపించేశారు. శివాజీ, ఆయన కొడుకు బుట్టల్లోంచి బయటకొచ్చి ఆగ్రా నుంచి ఆరు మైళ్ల దూరంలోని ఒక గ్రామం చేరుకున్నారు. అక్కడ ఆయన ప్రధాన న్యాయమూర్తి నీర్జీ రావ్‌జీ వాళ్ల కోసం ఎదురుచూస్తున్నారు.

### ఔరంగజేబ్‌కు చెమటలు పట్టాయి

మరో చరిత్రకారుడు ఎస్ఎమ్ పగాడీ తన 'ఛత్రపతి శివాజీ'లో ఇదే ఘటన గురించి మరో విధంగా చెప్పారు. "శివాజీ బుట్టలో దాక్కుని బయటికి వచ్చాడని అనుకోలేం. ఆయన పూర్తిగా నిస్సహాయ స్థితిలో బుట్టలో కూర్చునే లాంటి వ్యక్తి కాదు. ఆయన తొమ్మిదేళ్ల కొడుకు శంభాజీ కచ్చితంగా బుట్టలో కూర్చుని ఉంటాడు. కానీ శివాజీ కూలీ వేషంలో స్వయంగా ఆ బుట్ట మోసుకెళ్లి ఉంటారు" అన్నారు. ఈలోపు హీరాజీ ఫర్జాంద్ రాత్రంతా, తర్వాత రోజు మధ్యాహ్నం వరకూ అలా పడుకునే ఉన్నారు. గదిలోకి తొంగి చూసిన సైనికులకు ఆయన చేతికున్న శివాజీ బంగారు కడియం




కనిపించేది. దాంతో ఆయన అక్కడే పడుకుని ఉన్నారనుకునేవారు. నేల మీద కూర్చున్న మరో వ్యక్తి ఆయనకు మాలిష్ చేయడం కనిపించేది. సుమారు 3 గంటల సమయంలో హీరాజీ ఒక నౌకరుతో కలిసి ఆ ఇంటి నుంచి బయటపడ్డారు. వెళ్తూ వెళ్తూ "గట్టిగా అరవకండి, శివాజీకి ఆరోగ్యం సరిగా లేదు, ఆయనకు వైద్యం జరుగుతోంది" అని చెప్పారు. కాసేపటికి శివాజీ గది నుంచి ఎలాంటి శబ్దాలూ రాకపోవడంతో సైనికులకు సందేహం వచ్చింది. లోపలికెళ్లి చూస్తే అక్కడ ఎవరూ లేరు. వారు, ఆ విషయం మొదట తమ నాయకుడు ఫలాద్ ఖాన్‌కు చెప్పారు. షాకైన ఫలాద్ ఖాన్ ఔరంగజేబ్ దగ్గరకు వెళ్లి, ఆయన కాళ్లపై పడిపోయాడు. ఆయన నోట "అంతా మాయ..మాయ.. శివాజీ అదృశ్యం అయిపోయాడు. ఆయన గాల్లో ఎగిరెళ్లారో లేక ఆయన్ను భూమి మింగేసిందో నాకు తెలీడం లేదు" అన్నాడు. అది వినగానే ఔరంగజేబ్‌కు కూడా చెమటలు పట్టాయి. తన రెండు చేతులతో తల పట్టుకున్న ఆయన చాలాసేపటి వరకూ అలాగే కూర్చుండిపోయారు. వెంటనే నలువైపులా తన సైనికులను పంపించి శివాజీ కోసం వెతికించారు. అధికారులను పరుగులు పెట్టించారు. కానీ, వారందరూ వట్టి చేతుల్తో వెనక్కు వచ్చారు.

### మరోదారిలో రాజ్‌గఢ్ చేరిన శివాజీ

శివాజీ తెలివిగా, మహారాష్ట్ర చేరుకోవడానికి పూర్తిగా భిన్నంగా ఉండే మార్గాన్ని ఎంచుకున్నారు. నైరుతి దిశగా మాల్వా, ఖాన్‌దేశ్ మీదుగా వెళ్లడానికి బదులు, ఆయన తూర్పు దిశగా వెళ్లాలని అనుకున్నారు. మధుర, అలహాబాద్, వారణాసి, పూరీ మీదుగా గోండ్వానా(ఒడిషా), గోల్కొండ దాటి తిరిగి రాజ్‌గఢ్ చేరుకున్నారు. ఔరంగజేబ్ పట్టు నుంచి బయటకు వచ్చిన ఆరు గంటల్లోనే ఆయన మధుర చేరుకున్నారు. అక్కడ శివాజీ తన జుట్టు, గడ్డం, మీసాలు తీయించుకున్నారు. ఒక సామాన్యుడి వేషంలో కాషాయ బట్టలు ధరించారు. డిసెంబర్‌లో ఒక ఉదయం శివాజీ తల్లి జిజియాబాయి తన గదిలో ఒంటరిగా కూర్చుని ఉన్నప్పుడు.. ఆమె సేవకుడు లోపలికొచ్చాడు. అమ్మా, ఒక సన్యాసి మిమ్మల్ని కలవాలని అంటున్నాడని చెప్పారు. ఆమె ఆయన్ను లోపలికి పంపించమని చెప్పారు. ఆ సన్యాసి లోపలికి రాగానే, జిజియాబాయి కాళ్లకు నమస్కరించాడు. ఆమె ఆయనతో "సాధువులు వేరే వారి కాళ్లపై ఎప్పటి నుంచి పడుతున్నారు" అన్నారు. జిజియాబాయి తన చేతులతో పైకి లేపి, ఆ సాధువు ముఖం చూడగానే గట్టిగా 'శివాబా' అని అరిచారు.

# అత్తివరద దర్శనం .. 40ఏళ్లకోసారే ఎందుకంటే?







తమిళనాడులోని కాంచీపురం..! ఆలయాల నగరంగా ప్రసిద్ధి పొందిన పుణ్యప్రదేశం. వెయ్యికి పైగా దేవాలయాలున్న ఆధ్యాత్మిక ప్రాంతం. నిత్యం వేలాది మంది భక్తులు తరలి వస్తుంటారు. సాధారణంగానే సందడిగా కనిపించే కంచి...ఇప్పుడు మరింత కళ సంతరించుకుంది. భక్తుల సంఖ్య .. వేలు దాటి లక్షలకు చేరింది. కారణం.. దివ్య మంగళ స్వరూపమైన అత్తివరదరాజ స్వామి విగ్రహం...జలం వీడి జనంలోకి రావటమే..! 40 ఏళ్లకోసారి మాత్రమే కనిపించే ఈ అరుదైన దృశ్యం చూసేందుకు... భక్తులు దేశ నలుమూలల నుంచి కంచికి వరస కట్టారు. జీవితంలో ఒక్కసారైనా స్వామివారి తేజోమయమైన రూపం చూడాలని.. వేయి కళ్లతో నిరీక్షించిన వారంతా ఆలయానికి పోటెత్తారు. సినీ ప్రముఖులు, రాజకీయ నేతలు స్వామివారిని దర్శించుకుని తరించారు.

భక్తులకు వరాలు ఇవ్వడానికి దేవుడు దిగి వచ్చిన కథలు మనం విన్నాం. కానీ ఈయన చాలా ప్రత్యేకం. 40 ఏళ్ల ఎదురు చూపులకు తెర దించాడు. నీటి నుంచి పైకి వచ్చి మరీ అనుగ్రహిస్తున్నాడు. తమిళుల ఆరాధ్య దైవంగా, కోరిన కోర్కెలు తీర్చే దైవంగా కాంచీపురంలో కొలువైన వరదరాజ పెరుమాళ్ కథ ఇది.

**అంచనాలకు మించి పోటెత్తిన భక్తజనం :** వైకుంఠనాథుడైన శ్రీ మహావిష్ణువు చిద్విలాస మూర్తిగా వరాలనొసిగే వరదరాజ పెరుమాళ్ల ఆలయం మరోసారి అరుదైన ప్రదర్శనకు వేదికైంది. 40 సంవత్సరాలకు కేవలం 48 రోజులు మాత్రమే దర్శనమిచ్చే అనంతశయన మూర్తి దివ్య మంగళ విగ్రహం అత్తివరదరాజ స్వామిగా భక్తులకు దర్శనం ఇస్తున్నారు. ఈ తొమ్మిది అడుగుల దివ్య స్వరూపం తిలకించేందుకు రోజూ లక్షలాదిమంది తరలి వస్తున్నారు. జులై 1న ప్రారంభమైన అత్తివరదర్ వేడుకలు ఆగస్టు 17న ముగియనున్నాయి.



దేశంలో జరిగే వివిధ ఉత్సవాలకు ఏదో ఒక ప్రత్యేకత ఉంటుంది. అదే విధంగా ఆలయ కోనేటి గర్భంలో ఉండే స్వామి విగ్రహం 40 ఏళ్ల తర్వాత భక్తులకు దర్శనం ఇవ్వడమనేది అత్తివరదరాజ స్వామి ప్రత్యేకత. స్వామి వారి విగ్రహాన్ని పుష్కరిణి నుంచి బయటకు తీసుకొచ్చి పవళింపు సేవతో ఈ వేడుకలను ప్రారంభించారు. స్వామిని వీక్షించేందుకు దేశదేశాల నుంచి వస్తున్న లక్షలాది భక్తులతో కాంచీపురం భక్తజన క్షేత్రంగా మారింది. నిత్యం దైవస్మరణలో ఉండే ఈ మహా క్షేత్రంలో అనంత పద్మనాభుని దర్శనం ఎంతో పుణ్యమని భక్తుల విశ్వాసం.సినిమా తారలు మొదలుకొని గవర్నర్లు, మంత్రులు, సామాన్య భక్త జనం కాంచీపురానికి పోటెత్తారు. కాంచీపురం చరిత్రలో ఇంతటి పెద్ద జనసందోహం చూసి ఉండరు. ప్రభుత్వ వర్గాలు సైతం ఈ స్థాయిలో భక్తులు వస్తారని ఊహించలేదు. 48 రోజుల వ్యవధి ఉన్న ఉత్సవం కారణంగా సులభంగానే నిర్వహించవచ్చని ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం అంచనా వేశాయి. రోజురోజుకీ పెరిగిపోతున్న భక్తుల తాకిడిని చూసి ప్రభుత్వ వర్గాలే ఆశ్చర్యపోతుయాయి. అత్తివరదరాజస్వామిని ఇప్పటి వరకు కోటి మందికి పైగా దర్శించుకున్నారని ప్రభుత్వ అంచనా. 40 సంవత్సరాల తర్వాత కోనేటి నుంచి బయటకు వచ్చిన అత్తివరదరాజస్వామి 31 రోజులు శయన రూపంలోను 17 రోజులు స్థాన మూర్తిగా నిల్చొని దర్శనమిచ్చారు.

**బ్రిటిష్ వారు కూడా ఈయన భక్తులే..** దేశంలోని శ్రీ వైష్ణవ దివ్యక్షేత్రాల్లో కాంచీపురం ఒకటి. అక్కడి వైష్ణవాలయాల్లో ప్రసిద్ధి చెందింది వరదరాజ పెరుమాళ్ ఆలయం. వేఘవతి నది ఒడ్డున కొలువుదీరిన ఈ క్షేత్రానికి సంబంధించి ఎన్నో స్థల పురాణాలు ప్రచారంలో ఉన్నాయి. సాక్షాత్ బ్రహ్మదేవుడే ఈ శ్రీ అత్తి వరదరాజస్వామి విగ్రహాన్ని చెక్కించాడని, అందుకు దేవశిల్పి విశ్వకర్మ సహకరించాడని పురాణాలు చెబుతున్నాయి. అత్తి వరదరాజస్వామిని మహావిష్ణువు అవతారంగా భక్తుల విశ్వసిస్తుంటారు. స్థానికులు వరదరాజ పెరుమాళ్‌గా కొలుస్తుంటారు. ఈ స్వామి వారు...40 ఏళ్లకోసారి మాత్రమే దర్శనమివ్వటం వెనక ఎన్నో కథలు ప్రచారంలో ఉన్నాయి.దేశంలో మోక్షాన్ని ఇచ్చే నగరాలు ఏడు ఉన్నట్లు పురాణాలు పేర్కొంటాయి. ఆరు మోక్షపురులు ఉత్తర భారత దేశంలోనే ఉన్నాయి. అందులో ఒకే ఒక్క మోక్షపురి దక్షిణ భారతదేశంలో ఉంది. అదే కాంచీపురం. అలాంటి కాంచీపురంలోని ముఖ్యమైన ఆలయాల్లో వరదరాజ్ పెరుమాళ్ల ఆలయం ఒకటి. మూలవిరాట్టు అయిన విష్ణుమూర్తిని వరదరాజ స్వామిగా పిలుస్తారు. స్వామివారి దేవేరి పెరుందేవి. బ్రిటిష్ పాలకులు సైతం వరదరాజస్వామిపై భక్తి ప్రవత్తులు చాటుకున్నారు. బ్రిటిష్ గవర్నర్ జనరల్ రాబర్ట్ క్లైవ్ ఒకసారి అనారోగ్యం బారిన పడగా.. స్వామి వారిని వేడుకున్నాక సాంత్వన పొందారట. ఫలితంగా ఆయన, ఆయన భార్య వరదరాజ స్వామి భక్తులుగా మారి, స్వామివారికి కానుకలు, ఆభరణాలు సమర్పించారట. రాబర్ట్ క్లైవ్ 'మణికంఠిక' పేరుతో ఓ ఆభరణాన్ని ఇప్పటికీ స్వామి వారికి అలంకరిస్తుంటారు. అసలు ఈ అత్తివరదరాజ స్వామి ఎవరు? ఆయన 40 ఏళ్లకు ఒకసారి దర్శనం ఇవ్వడానికి గల కారణాలు ఏంటి? అని ఆరాతీస్తే పలు ఆసక్తి కరమైన విభిన్న కథనాలు స్థానికులు చెప్తారు. వాటిల్లో పురాణ కథనాలతో పాటు, చారిత్రక ఘట్టాలు ఉన్నాయి.

**తొలుత 60ఏళ్లకోసారే అవకాశం..** పురాణ కథనాల ప్రకారం కృతయుగంలో బ్రహ్మదేవుడు కంచిలో అశ్వమేధ యాగం చేశారట. యాగం నిర్విగ్నంగా జరిగేలా విష్ణుమూర్తి కాపాడట. ఆయనే ప్రస్తుతం ఉన్న మూలవిరాట్టు అత్తివరదరాజ స్వామి పెరుమాళ్. విగ్రహం మొత్తం అత్తి కలపతో తయారు చేయడం వల్ల ఈ స్వామి వారికి అత్తివరదుడు అనే పేరు వచ్చింది. బ్రహ్మదేవుని యజ్ఞకుండం నుంచి కూడా మరో విష్ణుమూర్తి ఉద్భవించారట. ఆ విష్ణుమూర్తి దారు విగ్రహమై యజ్ఞం తాలూకూ ఉష్ణ తాపంతో ఉన్నారట. అందుకే అత్తి వరదరాజ స్వామి విగ్రహానికి ఎల్లప్పుడూ పన్నీటి అభిషేకం చేసేవారట. తనలోని ఉష్ణతాపం చల్లార్చేందుకు ఆలయ కోనేరులో ఉంచాల్సిందిగా స్వామివారు అర్చకులకు కలలో వచ్చి చెప్పారని, అందుకే వరదరాజ స్వామిని కోనేటిలో ఉంచుతారని ఒక కథ ప్రచారంలో ఉంది. మొదటి స్వామి వారిని 60 ఏళ్లకొకసారి దర్శనార్థం ఉంచేవారు. కొన్ని శతాబ్దాల పూర్వమే.. 40 సంవత్సరాలకు కుదించారని చెబుతారు. వరదరాజ స్వామి విగ్రహాన్ని అత్తిచెట్టు కాండం నుంచి తయారు చేయటం వల్ల ఆపేరు స్థిరపడిపోయిందనీ అంటుంటారు. అందుకే ఆ విగ్రహం ఎన్నో ఏళ్లు నీటిలో ఉన్నా చెక్కు చెదరదు.

**పెరుమాళ్‌ను మోస్తున్న గజగిరి..** ఈ ఆలయానికి సంబంధించి మరో స్థల పురాణం కూడా ప్రచారంలో ఉంది. బ్రహ్మదేవుడు ఒక యజ్ఞం ప్రారంభించి, ఎటువంటి ఆటంకం కలగకుండా ఉండేందుకు స్వామి వారి విగ్రహాన్ని తయారు చేయించి కంచిలో స్వయంగా ప్రతిష్ఠించారని అంటారు. ఈ స్వామి అగ్ని దేవుని స్వరూపం. బయట ఎక్కువ కాలం ఉండలేరు. స్వామికి నిత్యాభిషేకాలు తప్పనిసరి. 9 అడుగులు ఉండే విగ్రహాన్ని మధ్య యుగంలో దాడులు జరుగుతున్న వేళ వెండి పెట్టెలో అమర్చి దేవాలయానికి దగ్గర్లో ఉండే పుష్కరిణిలో దాచిపెట్టాలని నిర్ణయించారు. ఆపై అదే దేవుని శిల్పాన్ని ఆలయంలో ప్రతిష్ఠించారు. ఈ ఆలయంలో మూలవిరాట్టు వరదరాజ పెరుమాళ్ పశ్చిమం వైపు, తాయారు పెరుందేవి తూర్పువైపు నిలబడినట్లు భక్తులకు దర్శనం ఇస్తున్నారు. ఆలయం ఉన్న కొండ ఏనుగు రూపంలో ఉంటుంది. పెరుమాళ్ మోస్తున్నందున ఈ కొండకు అత్తిగిరి కొండ అనే పేరు కూడా ఉంది. ఈ ఆలయంలో బంగారు, వెండి బల్లులు భక్తులకు దర్శనం ఇస్తున్నాయి. వీటన్నిటికీ మించిన మరో విశిష్టత ఇక్కడ ఉంది. ఆలయ ప్రాంగణంలోని అనంతసరస్సుగా పిలుచుకునే పుష్కరిణిలో మూడు మంటపాలు ఉన్నాయి. ఆరు స్తంభాలు, నాలుగు స్తంభాల మంటపాలతో పాటు శ్రీ కృష్ణుడి దివ్య విగ్రహం ప్రతిష్ఠించిన మంటపాలు ఉన్నాయి. అత్తివరదర్‌గా పిలుస్తున్నవరదరాజ స్వామి విగ్రహాన్ని వెండి పెట్టెలో పెట్టి నాలుగు స్తంభాల మంటపంలో నీటి అడుగు భాగాన భద్రపరిచారు. 40 ఏళ్లకొకసారి పుష్కరిణిలోని నీటిని తోడేసి విగ్రహం ఉన్న పెట్టె బయటకు తీసి విగ్రహాన్ని శుభ్రం చేస్తారు. పూజల తర్వాత ఆ విగ్రహాన్ని వసంత మంటపంలో ఉంచుతారు. 48 రోజుల తర్వాత స్వామి వారి విగ్రహం తిరిగి వెండి పెట్టెలో పెట్టి పుష్కరిణిలోని నాలుగు కాళ్ల మంటపంలో ఉంచి నీటితో నింపేస్తారు.

**మత్స్యావతారం ఎత్తి..సోమకుడిని వధించి** స్వామివారి జలావాసంపై రకరకాల కథనాలు ఉన్నాయి. పూర్వం యుద్ధం జరిగే సమయంలో ఆలయాలకు, దేవతా విగ్రహాలకు తగిన రక్షణ ఉండేది కాదు. ఆలయంలోని మూల విరాట్టును రక్షించుకునేందుకు అర్చకులు ఇలా భూమిలో దాచారని.. ఆపద సమయం ముగిసిన తర్వాత ఆ విగ్రహం బయటకు తీసి పూజించేవారని చెబుతారు. అత్తివరదరాజ స్వామిని భూమిలోపల దాచే సమయంలో ఏర్పడ్డ గుంత పుష్కరిణిగా రూపాంతరం చెందిందని చరిత్ర చెబుతుంది. పురాణాలు మాత్రం యాగగుండం నుంచి అత్తివరదర్ పుట్టినట్లు చెబుతున్నాయి. మత్స్యావతారం ఎత్తి నీటిలో దాగివున్న సోమకుడిని వధించి వేదాలు కాపాడిన విష్ణువు కాంచీపురంలో అత్తివరదరాజ స్వామిగా నీటి కొలనులో విశ్రమిస్తాడని మరో పురాణ ప్రతీతి.


**విష్ణుకంచిలో కొలువైన అత్తివరదరాజ స్వామి** వైష్ణవులకు పరమ పవిత్రమైన 108 దివ్య క్షేత్రాల్లో అత్తివరదరాజ స్వామి ఆలయం ఒకటి . శ్రీరంగం, తిరుమల తరువాత కంచి శ్రీ వరద రాజ పెరుమాళ్ కోవెల అత్యంత పవిత్ర దర్శనీయ క్షేత్రం.ఈ 108 దివ్య తిరుపతుల్లో పదునాలుగు కంచిలోనే ఉండటం విశేషం. అందులో కొన్ని విష్ణు కంచిలో ఉండగా మరి కొన్ని శివకంచిలో ఉంటాయి. విష్ణు కంచిలోని ఈ వరద రాజ పెరుమాళ్ కోవెల...ఎంతో విశేష పౌరాణిక, చారిత్రక నేపథ్యం సంతరించుకుంది.

**రామానుజాచార్యుల నివాసమిదే!** వరదరాజ పెరుమాళ్ ఆలయాన్ని హస్తగిరి ఆలయం లేదా అత్తియురాన్ అంటారు. ఈ ఆలయం ఉన్న ప్రదేశాన్ని విష్ణు కంచి అని పిలుస్తారు. ఇక్కడే రామానుజాచార్యులు నివసించారని చెబుతారు. కృతయుగంలో బ్రహ్మ, త్రేతాయుగంలోగజేంద్రుడు, ద్వాపరయుగంలో బృహస్పతి, కలియుగంలో ఆదిశేషుడు, ఆల్వారులు, శ్రీరామానుజాచార్యులు, ఆదిశంకరులు ... ఈ స్వామిని సేవించారని పురాణాలు పేర్కొంటున్నాయి. మొత్తం 25 ఎకరాల్లో ఉండే ఈ ఆలయాన్ని మొదట కంచిని పాలించిన పల్లవ రాజు రెండో నంది వర్మ క్రీ.శ 8వ శతాబ్దంలో నిర్మించినట్లుగా తెలుస్తోంది. తర్వాత చోళరాజులు పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశారని శాసనాలు తెలియజేస్తున్నాయి. మరెన్నో రాజవంశాలు ఆలయానికి తమ వంతు కర్తవ్యంగా సేవలందించాయి. విజయనగర రాజుల కాలంలోనే ఈ కోవెలలో ఎక్కువ నిర్మాణాలు జరిగి ప్రస్తుత రూపం సంతరించుకుంది. ఎన్నో తెలుగు, తమిళ, కన్నడ శాసనాలు ఇక్కడ కనిపిస్తాయి. మొత్తం మూడు ప్రాకారాలతో 32 ఉపాలయాలతో, 19 విమాన గోపురాలు 300 పై చిలుకు మంటపాలతో శోభాయమానంగా ఉంటుంది. అద్భుతమైన శిల్ప కళ ఈ ఆలయం సొంతం. ముఖ్యంగా అనంత పుష్కరిణి పక్కన ఉండే నూరు స్తంభాల మంటప శిల్ప శోభ వర్ణనాతీతం. ఒకే రాతిపై చెక్కిన గొలుసులు, కూర్మ సింహాసనానికి దిగువన అమర్చిన తిరిగే చక్రాలు, స్తంభాలకు చెక్కిన రామాయణ, మహాభారత సన్నివేశాలు మహాద్భుతంగా ఉంటాయి.

**ప్రమాదం నుంచి తప్పించుకోవడానికి నీటిలో...** చారిత్రక ఇతివృత్తాన్ని పరిశీలిస్తే 16శతాబ్దంలో ఈ వరద రాజస్వామి ప్రతిమకు గర్భగుడిలోనే పూజలు చేసేవారు. ముస్లిం పాలకులు వరుసపెట్టి కొన్ని ఆలయాల్లోని విగ్రహాలను ధ్వంసం చేయసాగారు. వారి బారి నుంచి కాపాటానికి స్వామివారి అర్చకులు ఆలయ కోనేరు అనంత సరస్పుష్కరిణిలో ఎవరికీ తెలియకుండా భద్రంగా దాచారట. ఆలయ నిర్వాహకులైన ధర్మకర్తలకు సైతం విగ్రహాన్ని ఎక్కడ దాచారో చెప్పలేదట. కొన్నేళ్ల తర్వాత పుష్కరిణిలో విగ్రహం దాచిన అర్చకులు మరణించారు. ముప్పు తొలగిన తర్వాత అప్పటి ఆలయ అర్చకులకు విగ్రహం దొరకలేదు. అందుకని గర్భగుడిలో మరో విగ్రహాన్ని శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. ఆయనే ప్రస్తుత మూలవిరాట్ వరదరాజ స్వామి. స్వామి వారి దేవేరి పేరు పెరుందేవి. అంటే మహాలక్ష్మి అని అర్థం. ఆలయ కోనేరు పేరు అనంత సరస్. ఇది జీవ పుష్కరిణి. ఎప్పుడూ నీటితో కళకళాడుతూ ఉంటుంది. ఆలయ పుష్కరిణిలో నాలుగు కాళ్ల మండపం ఉంటుంది. మండపం కింద భాగంలో బిలం వంటి ప్రదేశంలో అత్తి వరదరాజ స్వామి 40 ఏళ్ల పాటు జలవాసం చేస్తారు. ఒకానొక సందర్భంగా నీరు పూర్తిగా ఇంకిపోయిందట. అప్పుడే కోనేటి గర్భంలో ఉన్న విగ్రహం బయటపడిందట. ఒకే ఆలయంలో ఇద్దరు మూలవిరాట్‌లు ఉండటం ఆగమశాస్త్రం ప్రకారం నిషిద్ధమట. అందుకే 40 ఏళ్లకోసారి కోనేటి నుంచి తీసి 48రోజుల పాటు భక్తుల సందర్శనార్థం బయటకు తీసే సంప్రదాయం మొదలైంది. అత్తి వరదరాజ స్వామిని 1783లో కోనేటి నుంచి వెలికి తీసినట్లు ఆలయంలో ఉన్న తెలుగు శాసనం చెబుతోంది. 40 ఏళ్లకోసారి దర్శనం ఏర్పాటు చేసే సంప్రదాయం 1854 నుంచి కొనసాగుతున్నట్లు అప్పటి వార్తా పత్రికల కథనాల ఆధారంగా తెలుస్తోంది. 1892, 1937, 1979 తర్వాత ఈ ఏడాదిలో మళ్లీ ఈ మహా క్రతువును నిర్వహించారు. 1977-78లో రాజగోపురం నిర్మాణ పనుల వల్ల ఈ క్రతువు రెండేళ్లు ఆలస్యమైంది. ఈ గుడికి సంబంధించి 362 రాత ప్రతులు లభించాయి. ఇందులో కొన్ని కాకతీయులు, తెలుగు చోళులకు చెందినవి కూడా ఉన్నాయి.

**దర్శనంపై కోర్టులో కేసులు......** శయన మూర్తిగా ఉన్న స్వామి యోగమూర్తిగా జ్ఞానం ప్రసాదిస్తారని, నిలువు మూర్తిగా భక్తుల కోర్కెలు తీరుస్తారని భావిస్తారు. అందుకే శయన మూర్తిగా ఉన్న స్వామివారిని రోజుకు లక్షమందికిపైగా దర్శించుకుంటారు. నిలువు మూర్తిగా దర్శనానికి ఉంచిన సమయంలో వారి సంఖ్య దాదాపు రెట్టింపయ్యింది. అత్తి వరదరాజ స్వామి దర్శనానికి సంబంధించి మద్రాసు హైకోర్టులో పలు దావాలు కూడా వేశారు. విదేశీ పాలకుల నుంచి కాపాడేందుకు స్వామి వారిని పుష్కరిణిలో దాచారని, ఇప్పుడు అలాంటి ప్రమాదం ఏమీ లేనందున 365 రోజులు స్వామి వారిని దర్శనానికి ఉంచాలని పిటిషన్ వేశారు.


కేవలం 48 రోజులు సరిపోవని మరో 10 రోజులు పెంచాలని ఇంకో పిటిషన్ వేశారు. మతాచాచరాల విషయంలో జోక్యం తగదని, ప్రస్తుత సంప్రదాయాన్నే కొనసాగించాలని మద్రాసు హైకోర్టు అన్ని పిటిషన్లనూ తోసిపుచ్చింది. మళ్లీ స్వామివారిని దర్శించుకోవాలంటే 2059లోనే సాధ్యం.





# 'మురారి' రీ రిలీజ్..

## ఆల్ టైమ్ రికార్డ్ క్రియేట్ చేసిన మహేశ్ బాబు



ప్రిన్స్ మహేశ్ బాబు మురారి రీ రిలీజ్ ఆల్ టైమ్ రికార్డ్ క్రియేట్ చేసింది. ఆగష్టు 09న సూపర్ స్టార్ మహేశ్ బాబు బర్త్ డే సందర్భంగా ఈ సినిమాను రీ రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. చాలా రోజులకు మహేశ్ మూవీ రీ రిలీజ్ అవ్వడంతో థియేటర్‌లంతా హౌస్‌ఫుల్ షోలతో రన్ అయ్యింది. అయితే తాజాగా ఈ చిత్రం రీ రిలీజ్‌లో కూడా రికార్డు కలెక్షన్స్ సాధించింది. ఓవర్సీస్‌లో దూమ్ములేపినట్లు తెలుస్తుంది. అమెరికాలో రీ రిలీజ్ చేసిన సినిమాల్లో అత్యధిక కలెక్షన్లు సాధించిన మూడో చిత్రంగా మురారి నిలిచింది. ఎన్టీఆర్ నటించిన సింహాద్రి చిత్రం మొదటి స్థానంలో ఉంది. ఇక మురారి రీ రిలీజ్ కలెక్షన్లు చూసుకుంటే ప్రపంచవ్యాప్తంగా రూ. 5.5 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. ఓవరాల్‌గా చూసుకుంటే రీ రిలీజ్ కలెక్షన్స్‌లో ఖుషి టాప్ ప్లేస్‌లో ఉండగా.. బిజినెస్‌మాన్ రెండో స్థానంలో ఉంది. మురారి టాప్ 3లో నిలిచింది. మహేశ్ కెరీర్‌లో గుర్తుండిపోయే బ్లాక్ బస్టర్ చిత్రాలలో ఒకటి మురారి టాలీవుడ్ క్లాసికల్ దర్శకుడు కృష్ణవంశీ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రంలో మహేశ్, సోనాలి బింద్రే హీరో హీరోయిన్‌లుగా నటించారు. 2001లో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం సూపర్ హిట్ అందుకోవడమే కాకుండా టాలీవుడ్ నుంచి వచ్చిన ఆల్ టైం క్లాసిక్‌లలో ఒకటిగా నిలిచింది.

# మాకు ఎంగేజ్‌మెంట్ అయిన 9 ఏండ్ల తర్వాత పెళ్లి చేసుకున్నాం: తాప్సీ

బాలీవుడ్ నటి తాప్సీ పన్ను రీసెంట్‌గా పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. డెన్మార్క్‌కు చెందిన మతియాస్ బో అనే వ్యక్తిని పెళ్లి చేసుకుంది. అయితే పెళ్లి అనంతరం తన భర్త గురించి కానీ.. తన గురించి కానీ ఎక్కడ న్యూస్ రాలేదు. తాప్సీ కూడా అతడితో ఉన్న ఫొటోలను పోస్ట్ చేయలేదు. అయితే తన తాజా చిత్రం ఫిర్ ఆయీ హసీన్ దిల్రూబా నెట్‌ఫ్లిక్స్ వేదికగా ఆగష్టు 09న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. రీసెంట్‌గా ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా తన రిలేషన్‌షిప్ గురించి అడుగగా.. తాప్సీ సమాధానమిస్తూ సంచలన వ్యాఖ్యలు చేసింది.తాప్సీ ఈ ఏడాది మార్చి 23న పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. అయితే తన ఎంగేజ్‌మెంట్ మాత్రం 9 ఏళ్ల క్రితమే అయినట్లు ప్రకటించింది. మతియాస్ బో ను నేను 11 ఏళ్ల ముందు కలిశాను. 1 ఇయర్ వరకు డేటింగ్‌లో ఉన్న తర్వాత మతియాస్ నాకు ప్రపోజ్ చేశాడు. అప్పుడే మేము ఎంగేజ్‌మెంట్ చేసుకున్నాం అయితే ఇన్ని సంవత్సరాలు మేము విడిపోకుండా ఉన్నామంటే అది ఇద్దరి మధ్య ఉన్న ప్రేమ వల్లనే. అయితే మా ఫస్ట్ డేట్‌కి దుబాయ్ వెళ్లామని చెప్పుకొచ్చింది.ఇక తాప్సీ భర్త విషయానికి వస్తే.. మథియాస్ బో డెన్మార్క్‌కు చెందిన బ్యాడ్మింటన్ క్రీడాకారుడు. ఇతడు 2012 సమ్మర్ ఒలింపిక్స్‌లో రజతం సాధించాడు. అలాగే 2015 యూరోపియన్ గేమ్స్‌లో బంగారు పతక విజేత, 2012 మరియు 2017లో రెండుసార్లు యూరోపియన్ ఛాంపియన్‌గా నిలిచాడు.




# బ్యాడ్మింటన్ ప్లేయర్‌తో ప్రేమలో పడిన ఆర్జీవీ మేనకోడలు



టాలీవుడ్ వివాదాస్పద దర్శకుడు రాం గోపాల్ వర్మ మేనకోడలు పెళ్లి పీటలు ఎక్కబోతుంది. వర్మ మేనకోడలు సినీ నిర్మాత ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ శ్రావ్య వర్మ, బ్యాడ్మింటన్ ప్లేయర్ కిదాంబి శ్రీకాంత్ ఒక్కటికానున్నారు. తాము శనివారం ఎంగేజ్‌మెంట్ చేసుకున్నట్లు శ్రావ్య సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీనిపై కిదాంబి శ్రీకాంత్ ఇన్‌స్టా వేదికగా వెల్లడిస్తూ.. శ్రావ్య నాకు ఓకే చెప్పింది. మేమిద్దరం కలిసి ఒక అంతులేని కథను రాసేందుకు సిద్ధమవుతున్నాం అంటూ రాసుకొచ్చాడు. శ్రావ్య వర్మ టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండతో పాటు అక్కినేని నాగార్జున, పంజా వైష్ణవ్ తేజ్, విక్రమ్ తదితర హీరోలకు కాస్ట్యూమ్ డిజైనర్‌గా వ్యవహారించింది. ఇక శ్రావ్య వర్మ తన మేనకోడలని రామ్ గోపాల్ వర్మ లక్ష్మీస్ ఎన్టీఆర్ అనే సినిమా ఈవెంట్‌లో పరిచయం చేశాడు.

# సమంతకు ప్రపోజ్ చేసిన అభిమాని.. ఓకే చెప్పిన హీరోయిన్!






టాలీవుడ్ నటి సమంత ఒక యువకుడికి ఓకే చెప్పింది. తనను ఇన్‌స్టాలో ప్రపోజ్ చేసిన యువకుడితో బాగుంది కన్వీన్స్ అయ్యానంటూ చెప్పుకొచ్చింది. సమంత మాజీ భర్త హీరో నాగ చైతన్య రెండో పెళ్లి చేసుకుంటున్న విషయం తెలిసిందే. తెలుగు నటి శోభిత ధూళిపాళ్లను అతడు త్వరలో వివాహం చేసుకోనున్నాడు. అయితే రీసెంట్‌గా వీరిద్దరి ఏంగేజ్‌మెంట్ గ్రాండ్‌గా జరిగింది. అయితే నాగ చైతన్య రెండో పెళ్లి చేసుకుంటున్నాడు అని ప్రకటించిన అనంతరం సమంత మళ్లీ ట్రెండింగ్‌లోకి వచ్చింది. ఈ క్రమంలోనే సమంతకు ఓ అభిమాని చేసిన ప్రపోజల్ చేయగా.. ఆ అభిమానికి ఫన్నీగా ఓకే చెప్పింది సామ్. సమంత మీద తనకున్న ప్రేమను ఇన్‌స్టాగ్రామ్ ఇన్‌ఫ్లుయెన్సర్ సోషల్ మీడియా వేదికగా తెలుపుతూ.. ఒక వీడియో క్రియేట్ చేశాడు. ఈ వీడియోలో.. సామ్ నువ్వు బాధ పడాల్సిన అవసరం అస్సలు లేదు. నీకోసం నేను ఎప్పుడూ ఉంటాను. నువ్వు నేను కలిస్తే ఒక మంచి జంట అవుతుంది. నువ్వు ఓకే అంటే పెళ్లి చేసుకోవడానికి రెడీగా ఉన్నాను. నాకోక 2 ఇయర్స్ టైం ఇవ్వు డబ్బులు సంపాదిందిచ నీ దగ్గరికి వస్తాను. అప్పటివరకు నా గుర్తుగా ఈ పువ్వు అదే హార్ట్‌ను ఉంచుకో. ప్లీజ్ మ్యారీ మీ, ప్లీజ్ మ్యారీ మీ సామ్ అంటూ ఒక వీడియోను పోస్ట్ చేశాడు. ఈ వీడియో చూసిన సమంత.. బ్యాక్‌గ్రౌండ్‌లో జిమ్ ఉంది. నేను ఆల్మోస్ట్ కన్విన్స్ అయ్యాను అంటూ అభిమానికి రిప్లయ్ ఇచ్చింది. కాగా ఈ పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# వరుణ్ తేజ్ మట్కా కింగ్ వాసులుక్ అదిరింది.. !

టాలీవుడ్ హీరో వరుణ్ తేజ్ నటిస్తోన్న సినిమాల్లో ఒకటి పీరియాడిక్ బ్యాక్ డ్రాప్‌లో తెరకెక్కుతోన్న మట్కా ఈ చిత్రానికి పలాస 1978 ఫేం కరుణకుమార్ దర్శకత్వం వహిస్త్నుడు. ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి, నోరా ఫతేహి హీరోయిన్లుగా నటిస్తున్నారు. షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమా నుంచి అదిరిపోయే లుక్ షేర్ చేశారు. కమాండ్ చేసేందుకు, జయించేందుకు ఇక్కడ ఉన్నాడు.. మట్కా కింగ్ వాసును కలవండి.. అంటూ షేర్ చేసిన తాజా పోస్టర్‌లో వరుణ్ తేజ్ చేతిలో సిగరెట్ పట్టుకుని కనిపిస్తుండగా.. టేబుల్‌పై ఓ వైపు పిస్తోల్, మరోవైపు డబ్బు కనిపిస్త్నుయి. ఇప్పటికే ప్రొడక్షన్ టీం 1980 బ్యాక్‌డ్రాప్ వైజాగ్ లొకేషన్స్‌ను రీక్రియేట్ చేసిన స్పెషల్ గ్లింప్స్ వీడియో షేర్ చేయగా.. నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రాన్ని వైరా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే లాంచ్ చేసిన మట్కా టైటిల్ టీజర్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతూ సూపర్ హైప్ క్రియేట్ చేస్తోంది. వరుణ్ తేజ్ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఫిలింనగర్ సర్కిల్ సమాచారం. ఈ చిత్రంలో వరుణ్ తేజ్ నాలుగు డిఫరెంట్ గెటప్స్‌లో కనిపించబోతున్నాడట.



# కల్కి 2898 ఏడీ మేకర్స్ తీరుతో చిరంజీవి అభిమానులు అప్‌సెట్..




టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి కెరీర్‌లో వన్ ఆఫ్ ది బిగ్గెస్ట్ ల్యాండ్ మార్క్ సినిమా ఇంద్ర . బి గోపాల్ దర్శకత్వంలో వైజయంతి మూవీస్ బ్యానర్‌పై అశ్వనీదత్ నిర్మించారు. చిన్ని కృష్ణ కథనందించిన ఈ చిత్రం 2002 జూలై 24న ప్రేక్షకుల ముందుకు వచ్చి.. బాక్సాఫీస్ వద్ద వసూళ్లు వర్షం కురిపించింది. చిరంజీవి కెరీర్‌లోనే అప్పటివరకు ఉన్న కలెక్షన్ల మార్క్‌ను దాటేసిన చిత్రంగా ఇంద్ర నిలిచింది. ఈ సినిమా విడుదలై ఇటీవలే విజయవంతంగా 22 ఏండ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా అభిమానులు, మూవీ లవర్స్ కోసం చిరంజీవి బర్త్ డే కానుకగా ఆగష్టు 22న రీ రిలీజ్ చేయబోతున్నామని ప్రకటించారు. అయితే బర్త్ డే దగ్గర పడుతుండగా.. మరోవైపు మేకర్స్ నుంచి మాత్రం కొత్త వార్త ఏమీ రాకపోవడంతో అభిమానులు అప్‌సెట్‌లో ఉన్నారన్న వార్త ఒకటి ఫిలింనగర్ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. ఇంద్ర రీరిలీజ్‌కు సంబంధించిన రెగ్యులర్ అప్‌డేట్స్ అందించాలని కల్కి 2898 ఏడీ మేకర్స్ అయిన వైజయంతీ మూవీస్‌ను విజ్ఞప్తి చేస్తున్నారు. రీరిలీజ్ ట్రెండ్స్‌లో సరికొత్త రికార్డులు నెలకొల్పేలా గ్రాండ్ ఈవెంట్ ప్లాన్ చేయాలంటూ కోరుతున్నారు. మరి వైజయంతీ మూవీస్ బ్యానర్‌పై ఫ్యాన్స్ కోసం ఏదైనా అప్‌డేట్ ఇస్తుందేమో చూడాలి. ఇంద్రలో సోనాలి బింద్రే, ఆర్తి అగర్వాల్ హీరోయిన్లుగా నటించారు. ప్రకాశ్ రాజ్, ముఖేశ్ రిషి, పునీత్ ఇస్సార్, తనికెళ్లభరణి, అల్లు రామలింగయ్య, బ్రహ్మానందం, ధర్మవరపు సుబ్రహ్మణ్యం ఇతర కీలక పాత్రల్లో నటించారు.

PRINTED, PUBLISHED AND OWNED BY NALAM SHASHIDHAR, PRINTING AT SHARADHA PRINTERS #3-6-194, SHASTRI ROAD, KARIMNAGAR-505001.
PUBLISHED FROM #9-9-95/1, RAMNAGAR, KARIMNAGAR DISRICT, TELANGANA STATE, PIN-505001, Email id: tgktelugudaily@gmail.com, Editor : NALAM SHASHIDHAR, RNI NO: TELTEL/2014/54796, CELL: 91-9951242422.